



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 147 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 18 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### గత ప్రభుత్వం తెచ్చిన జీవో 117తో

# ప్రభుత్వ స్కూళ్లకు బాలల దూరం!



**వన్ క్లాస్ - వన్ టీచర్ పాఠశాలలను 33శాతానికి పెంచాం - రూ.1000 కోట్లతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తాం**

**శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ప్రభుత్వం 2019-24 నడుమ జీవో 117 తేవడంతో పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజాప్రభుత్వం వచ్చాక జీవో 117 రద్దుచేశామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ...గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన తర్వాత కూడా 233 పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా పాఠశాల విద్యాభివృద్ధిలో వన్ క్లాస్ - వన్ టీచర్ విధానం చాలా కీలకమైంది. గతంలో 3శాతం పాఠశాలల్లో మాత్రమే వన్ క్లాస్ - వన్ టీచర్ ఉంటే, ఇప్పుడు 33శాతానికి పెంచాం. దీనిద్వారా పిల్లలకు మెరుగైన విద్య అంది, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వస్తాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రధానంగా 5 అంశాలను పరిగణనలోకి తీసుకున్నాం. ప్రధానంగా లీక్ ప్రూఫ్ బిల్డింగ్, పెయింట్స్, బెంచీలు, టాయ్‌లెట్స్, తాగునీరు అందించాలని నిర్ణయించాం. ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ ఇచ్చాం. ఏపీలో 5స్టార్ రేటింగ్ ఉన్నవి లేవు. 40శాతం 1,2లో స్టార్‌లో ఉన్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 3, 4 స్టార్ రేటింగ్ కు తేవాలన్నది ప్రజాప్రభుత్వ లక్ష్యం. పెండింగ్ వర్క్స్ పూర్తిచేయాల్సిన బాధ్యత మాపై ఉంది. ఎక్కడ క్లాస్ రూమ్స్ అవసరం ఉందో, అక్కడ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని నిర్ణయించాం. ఎస్ఎంసీ ఎకౌంట్ లో రూ.200 కోట్ల నిధులు ఉన్నాయి. బడ్జెట్ లో రూ.800 కోట్లు అదనంగా కేటాయించారు. ఈ రెండు కలిపి వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక మౌలిక సదుపాయాలకు రూ. వెయ్యి కోట్లు ఖర్చుచేసే అవకాశం ఉంది. అన్ని మిగతా .. 2లో..

### ముంబయిలో

# మెక్రాన్-మోదీ భేటీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్.. ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. మంగళవారం ముంబయిలోని లోక్‌భవన్‌లో ఇరువురు నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మెక్రాన్‌ను మోదీ సాదరంగా స్వాగతించారు. ఈ భేటీకి ముందు తాజ్ హోటల్ వద్ద 26/11 ముంబయి పేలుళ్ల మృతులకు మెక్రాన్, ఆయన సతీమణి బ్రిగిట్టి నివాళులర్పించారు. మూడురోజుల పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి మెక్రాన్ ముంబయికి వచ్చారు. రఫేల్ ఫైటర్ జెట్ ఒప్పందం, కృత్రిమ మేధలో మిగతా .. 2లో..

# విశాఖపట్నం చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశాఖపట్నం చేరుకున్నారు. ఐఎన్ఎస్ డేగాకు వచ్చిన రాష్ట్రపతికి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి స్వాగతం పలికారు. వీరితోపాటు ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాస్, ఉన్నతాధికారులు ఉన్నారు. విశాఖ మిగతా .. 2లో..

### శివుడికి

# ప్రసాదంగా డ్రగ్స్..

**సీపీ సజ్జనార్ పోస్టుతో పోలీసుల యాక్షన్**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మహా శివరాత్రి రోజున దేవుడికి మాదక ద్రవ్యాలు చూపిస్తూ కొందరు రీల్స్ చేయడంపై హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ వ్యవహారంపై వెంటనే స్పందించిన చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఫలక్‌నుమా జంగమ్మెట్‌కు చెందిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఫలక్‌నుమా మిగతా .. 2లో..

# అంబటి అరెస్టు అన్యాయం

**వైసీపీ నేతలను కక్షపూరితంగా జైల్లో పెడుతున్నారు : మాజీమంత్రి గుడివాడ అమర్ నాథ్**

**కూటమి బడ్జెట్ డొల్ల.. ప్రజలు కొడతారు జల్ల... : కరణం ధర్మశ్రీ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ వైసీపీ నాయకులను టార్గెట్ చేస్తోందని మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు గుడివాడ అమర్ నాథ్ విమర్శించారు. అంబటి రాంబాబును అన్యాయంగా జైల్లో పెట్టారని ఆయన మండిపడ్డారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబుతో మంగళవారం ఉత్త రాంధ్ర వైసీపీ నేతలు ములాఖాత్ అయ్యారు. అంబటిని మూలాఖత్‌లో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిన్ని శ్రీను, మాజీ ప్రభత్వ విప్ కరణం ధర్మశ్రీ అంబటిని కలిశారు. ఈనెల 1 నుంచి రాజమండ్రి సెంట్రల్ జైల్లో అంబటి రాంబాబు రిమాండులో ఉన్న సంగతి తెలిసిందే. వివిధ కేసుల్లో రిమాండ్ కొనసాగుతోంది. ఈ సందర్భంగా జైలు బయట మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న కక్ష పూర్తి రాజకీయాలపై చర్చ జరుగుతోందని అన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్లో. ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబును మిగతా .. 2లో..

### ఏపీ సాంస్కృతిక పునరుజ్జీవనానికి

# బాటలు వేద్దాం


**సాంస్కృతిక శాఖపై జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సాంస్కృతిక, పర్యాటక, ఫిల్మ్ టూరిజం విభాగాలను సమన్వయం చేస్తూ "ఆరెంజ్ ఎకానమీ"ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జూన్ లేదా జూలై మాసాల్లో దీనిపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిద్దామన్నారు. "ఆరెంజ్ రెవల్యూషన్" ద్వారా రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాలని పిలుపునిచ్చారు. మంగళవారం విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో శాఖాపరమైన అంశాలపై సాంస్కృతిక శాఖ అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కవులు, కళాకారులకు అత్యున్నత గౌరవం దక్కుతుంది. సాంస్కృతిక శాఖ మిగతా .. 2లో..

# 'ఎంతసేపు చదివామన్నది కాదు'


**జేఈఈ మెయిన్ టాపర్ కబీర్ చిల్లర్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన జేఈఈ మెయిన్ 2026 సెషన్-1 ఫలితాల్లో రాజస్థాన్ నుంచి 17 ఏళ్ల కబీర్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. జేఈఈ మెయిన్‌లో 300కు 300 స్కోర్ సాధించాడు. టాప్ స్కోర్ సాధించడంపై కబీర్ మీడియాతో మాట్లాడుతూ.. పట్టుదల, నిరంతర శ్రమ వల్లే తాను మెయిన్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించినట్లు తెలిపారు. ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ చదవడం తన లక్ష్యమన్నారు. కేంబ్రిడ్జ్‌లోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఉన్నతవిద్య మిగతా .. 2లో..

### కమల్‌హాసన్ 'ఎంఎన్ఎం' పార్టీకి

# టార్చిలైట్ గుర్తు



**విశ్వం వాయిస్ న్యూస్ :** కమల్ హాసన్ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీకి భారత ఎన్నికల సంఘం టార్చి లైట్ గుర్తును కేటాయించింది. పుదుచ్చేరిలో ఎన్నికల కోసం ఈ గుర్తును కేటాయించినట్లు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో అక్కడ అన్ని నియోజకవర్గాల్లో ఈ గుర్తుతో ఎంఎన్ఎం బరిలోకి దిగనుంది. ఈ ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుర్తింపుపొందని రాజకీయ పార్టీలు గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ ఇటీవల కోరిన సంగతి తెలిసిందే. ఈ మేరకు.. దిల్లీలోని ప్రధాన ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఎంఎన్ఎం పార్టీ పది చిహ్నాలు ఉన్న జాబితాను అందించి, వాటిలో ఒక దానిని కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. తమిళనాడులో మిగతా .. 2లో..

### బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ రెహమాన్

# ప్రమాణస్వీకారం



**విశ్వం వాయిస్ న్యూస్ :** బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ ఆయనతో పాటు పలువురు క్యాబినెట్ మంత్రులతో ప్రమాణం చేయించారు. రాజధాని నగరం ఢాకాలో ఈ కార్యక్రమం జరిగింది. బంగ్లా ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యారు.

**35 ఏళ్ల తర్వాత తొలి పురుష ప్రధాని..**

బంగ్లాదేశ్‌లో గత 35 ఏళ్లుగా మహిళలే ప్రధానులుగా కొనసాగారు. ఈ కాలంలో అవామీ లీగ్ అధినేత నేత షేక్ హసీనా, బీఎన్‌పీ నాయకురాలు ఖాలిదా జియాలే దేశానికి నాయకత్వం వహించారు. ఇప్పుడు బీఎన్‌పీ ఛైర్మన్‌గా ఉన్న తారిఖ్ రెహమాన్ 35 ఏళ్ల తర్వాత ఆ పదవిని అధిష్ఠించిన పురుష ప్రధానిగా నిలిచారు. ఖాలిదా జియా కుమారుడైన రెహమాన్ 2008లో బంగ్లా విడిచి వెళ్లారు. 17 ఏళ్ల పాటు బ్రిటన్‌లో ప్రవాస జీవితం గడిపారు. గతేడాది డిసెంబరులోనే స్వదేశానికి వచ్చారు. తల్లి మరణించడంతో పార్టీ బాధ్యతలు స్వీకరించి బీఎన్‌పీని విజయపథంలో నడిపారు. ఎన్నికల్లో తాను పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఆయన గెలుపొందారు. 299 పార్లమెంట్ స్థానాలకుగానూ 209 చోట్ల పార్టీ విజయం సాధించింది. 2024లో హసీనా ప్రధాని పదవిని కోల్పోయిన తర్వాత నేడు బంగ్లాలో ప్రజాస్వామ్యయుతమైన ప్రభుత్వం ఏర్పడింది.

# త్వరలో హైదరాబాద్‌లోని ప్రతి జోన్‌లో పర్యటిస్తా..

**తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని నెక్లెస్ రోడ్ రైల్వేస్టేషన్ వద్ద మల్టీలెవల్ కారు పార్కింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ విభజనలో తలెత్తిన సమస్యలకు పరిష్కారాలు సూచించారు. మూడు కార్పొరేషన్లలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో స్మార్ట్ మిగతా .. 2లో..

### నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా

# శనగల కొనుగోళ్లు ప్రారంభం

**15 రోజుల లోపు రైతులకు నగదు చెల్లింపులు**

**వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం & రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ అనుమతితో రబి సీజన్ 2025-26 లో పండించిన శనగలను NAFED, NCCFల ద్వారా మిగతా .. 2లో..

### డిజిటల్ అటెండెన్స్

# బాగా పనిచేస్తోంది

**స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. "అసెంబ్లీకి హాజరుకావడం ఎమ్మెల్యేల విధి. కొందరు అసలు సభకే రాకుండా జీతభత్యాలు తీసుకోవటం తగదు. అలాంటి వారికి జీతం కట్ చేయాలి. ఉద్యోగులు కార్యాలయానికి రాకపోతే వారికి జీతాలు కట్ చేసి చర్యలు తీసుకునేందుకు ఉన్న నిబంధన ఎమ్మెల్యేలకు ఎందుకు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ప్రభుత్వ స్కూళ్లకు బాలల దూరం!

ప్రభుత్వ పాఠశాలల్లో ఒక పద్ధతి ప్రకారం 5స్టార్ రేటింగ్ తెచ్చే బాధ్యత ప్రజాప్రభుత్వం తీసుకుంటుంది. 2014-19 నడుమ చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడతామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాలల విషయంలో అస్తవ్యస్థ విధానాలు అవలంభించింది. నాడు- నేడు పేరుతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడింది. వాటి కారణంగా నేటికి కూడా అనేక చోట్ల అసంపూర్తి నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యాన నూతన విద్యావిధానానికి శ్రీకారం చుట్టి, పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టుల నియామకం చేపట్టారు. మనబడి -- మన భవిష్యత్ పేరిట పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతూ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పెరుగుతోంది. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలు, తరగతి గదులను సత్వరం పూర్తిచేయాల్సిందిగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. 2019 ఎన్నికలకు ముందు తిత్లీ తుపానులో అనేక పాఠశాలలు దెబ్బతిన్నాయి. నాటి చంద్రబాబు గారి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసినప్పటికీ, టీడీపీ సానుభూతిపరులు పనులు చేశారనే కారణంతో వైసీపీ ప్రభుత్వం వాటి బిల్లులు చెల్లించలేదు. గత ఐదేళ్లలో నాడు-నేడు అక్రమాలపై చర్యలు తీసుకోండి. అసంపూర్తిగా నిలచిపోయిన భవనాలు పూర్తిచేయాల్సిందిగా గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు.

# విశాఖపట్నం చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

తీరంలో ఫిబ్రవరి 18న అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష-2026 జరగనుంది. ఈ సమీక్షకు రాష్ట్రపతి హాజరుకానున్నారు. 19న మిలాన్, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్, 20న ఐయాన్ కానైవ్ ఆఫ్ చీఫ్స్ కార్యక్రమాలు జరగనున్నాయి.

### ముంబయిలో
# మెక్రాన్-మోదీ భేటీ

సహకారం ప్రధాన ఎజెండాలుగా అధ్యక్షుడి పర్యటన సాగుతోంది. దిల్లీలో జరిగే 'ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో 19న మెక్రాన్ పాల్గొంటారు. భారత్‌కు 114 రఫేల్ యుద్ధవిమానాల సరఫరాకు మెక్రాన్ పర్యటన సమయంలోనే ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఈ కాంట్రాక్టు విలువ రూ.3.25 లక్షల కోట్లు. ఇది ఖరారైతే దేశ చరిత్రలో అతిపెద్ద రక్షణ ఒప్పందంగా నిలవనుంది.

### డిజిటల్ అటెండెన్స్
# బాగా పనిచేస్తోంది

వర్తించకూడదు? ఈ అంశాలపై జాతీయ స్థాయిలో చర్చ చేపట్టాలి. ఈ నిబంధన దాదాపు 8 దేశాల్లో అమల్లో ఉంది. అసెంబ్లీలో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పని చేస్తోంది.

# అంబటి అరెస్టు అన్యాయం

కలవడానికి వచ్చాము. అనారోగ్యం కారణంగా అంబటిని మధ్యాహ్నం 3 గంటలకు కలవడానికి అనుమతి ఇచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై దాడులు చేసి ఇళ్లను ధ్వంసం చేసిన వారు బయట తిరుగుతున్నారని ఆయన విమర్శిం చారు. అన్ని గమనిస్తున్నాం. రాజ్యాంగానికి విరుద్ధంగా కూటమి నేతలు వ్యవహ రిస్తున్నారని, మార్కెటింగ్ పబ్లిసిటీలతో ప్రభుత్వం నడుస్తోందని, రెండు సంవత్సరాలలో రెండున్నర లక్షల కోట్లు అప్పులు చేశారని గుడివాడ అమర్ నాథ్ విమర్శించారు. పులులను జైల్లో పెట్టారని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యకు ప్రతి చర్య ఉంటుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా డొల్ల,కూటమి ప్రభుత్వానికి ప్రజలు కొడతారు జల్లా అని వ్యాఖ్యానించారు. కూటమీ ప్రభుత్వానికి ప్రజలు సమాధి కట్టడం ఖాయమని, రాజ్యాంగానికి విరుద్ధంగా రెడ్బుక్ రాజ్యాంగాన్ని కొనసాగిస్తున్నారని, ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం కక్ష సాధింపు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. పాత్రికేయుల సమావేశంలో రాజానగరం మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకటరావు, రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్,మాజీ రూడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, న్యాయవాదులు వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ మాజీ జిల్లా అధికారి ప్రతినిధి పివివిఎస్‌బికె రాజు, సాదిక్ హసన్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకురాలు హసీనా, మాజీ కార్పొరేటర్ బొంత శ్రీహరి, బురిడీ త్రిమూర్తులు, అడపా అనిల్, కోడి కోట, గౌంటుముక్కల రాజు, వైఎస్ఆర్సీపీ యువ నాయకుడు కాక తదితరులు పాల్గొన్నారు.

### ఏపీ సాంస్కృతిక పునరుజ్జీవనానికి
# బాటలు వేద్దాం

365 రోజులు క్రియాశీలంగా పని చేస్తూ, కళాకారుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుంది. ప్రతి వారం దేవాలయాల్లో, హ్యాపీ సండే వంటి వేదికల్లో స్థానిక కళాకారులకు ప్రదర్శన ఇచ్చే అవకాశం కల్పిస్తామని సాంస్కృతిక శాఖ అధికారులకు హామీ ఇచ్చారు.. కళలను కేవలం ప్రదర్శనలుగా కాకుండా, ఒక సుస్థిర ఆర్థిక వనరుగా మార్చాలని సూచించారు..వచ్చే ఉగాది పురస్కారాల ఎంపికలో ఎటువంటి సిఫార్సులకు తావులేకుండా, క్షేత్రస్థాయిలో నిజమైన ప్రతిభ ఉన్న కళాకారులను గుర్తించి సత్కరించాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు. త్వరలోనే నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి తుది జాబితాను ప్రకటించాలని ఆదేశించారు. కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకం పునరుద్ధరణ చేయాలని అధికారులు కోరగా రాష్ట్ర వారసత్వ సంపదైన కూచిపూడి నృత్యాన్ని అట్టడుగు వర్గాలకు చేరవేయడమే లక్ష్యంగా గతంలో అమలు చేసిన 190 మంది కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకాన్ని పునరుద్ధరించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు..2019లో నిలిపివేసిన ఈ పథకం వల్ల వేలాది మంది విద్యార్థులు నష్టపోయారని, దీన్ని పునరుద్ధరించడం ద్వారా కళాకారులకు ఉపాధి దొరకడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ నృత్య వైభవం ప్రపంచవ్యాప్తం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కళాకారులందరికీ ఐడి కార్డ్స్ ఇవ్వాలని కోరగా మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. తెలుగు వారి సొంతమైన పద్యనాటకానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా ఒక కోర్సును రూపొందించాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. ఉగాది నుండి వారంలో మూడు రోజుల పాటు అతిథి ఉపాధ్యాయులతో క్లాసులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా నాటక పరిషత్తులకు ప్రత్యేక గ్రాంట్లు కేటాయించే విషయంపై చర్చించారు. రాజమండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా బ్రాంచి ఏర్పాటుకు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ శేఖవత్ గారు సుముఖత వ్యక్తం చేసినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం బడ్జెట్ విషయమై అధికారులు అడిగారు.. అదే విధంగా సౌత్ కల్చర్ జోన్ కి పెండింగ్ ఉన్న రూ. 3 కోట్ల 64 లక్షల నిధులపై చర్చించారు.. కర్నూలు, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న సంగీత కళాశాలలకు ప్రభుత్వ భవనాలు కేటాయించాలని, ప్రతి జిల్లాకు ఒక మ్యూజిక్ కాలేజీ ఉండాలని చర్చించారు. ఈ సందర్భంగా కోనసీమ ప్రభల తీర్థానికి అధికారిక గుర్తింపు వచ్చేందుకు కృషిచేసిన అధికారులను అభినందిస్తూ, వచ్చే ఏడాది మరింత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. గిరిజన ప్రాంతాల్లో వారి సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రత్యేకంగా 'గిరిజన ఉత్సవ్' నిర్వహించాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు. రాబోయే గోదావరి, కృష్ణా పుష్కరాల్లో సాంస్కృతిక శాఖ క్రియాశీలక పాత్రపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో చర్చించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అంతరించిపోయిన కళలు, సాంస్కృతిక రంగాలకు పునర్ వైభవం కల్పించి, కళాకారులను గౌరవంగా సత్కరించి రాష్ట్ర సాంస్కృతిక రంగానికి పునర్జీవం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అధికారులతో అన్నారు. అంతకుముందు మంత్రి కందుల దుర్గేష్ ఘంటసాల సంగీత కళాశాలలోని తరగతి గదులను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించి బోధనా తీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగడి మల్లికార్జున రావు, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్ పర్సన్ పొడపాటి తేజస్వి, జానపద కళల అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, మేనేజర్ శ్రీనివాస్ మరియు ఇతర శాఖాపరమైన సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఎంతసేపు చదివామన్నది కాదు'

అభ్యసించాలనుకుంటున్నట్లు తెలిపాడు. కోటాలో శిక్షణ తీసుకోవడం కూడా తనకు బాగా ఉపయోగపడిందన్నారు. జేఈఈలో మంచి మార్కులు సాధించడానికి ఎలా సన్నద్ధమవ్వాలనే విషయంపై తోటి విద్యార్థులకు పలు సూచనలు చేశాడు. అవేంటంటే?

జేఈఈలో మంచి మార్కులు సాధించాలంటే నిరంతర కృషితో పాటు పరీక్షలకు సన్నద్ధమవ్వడానికి సరైన పద్ధతిని అనుసరించడం అవసరం.

ఎక్కువ గంటలు చదవడానికి బదులు సబ్జెక్ట్‌లోని అంశాలను అర్థం చేసుకోవాలి.

వాటిని చిన్న చిన్న టాపిక్‌లుగా విడగొట్టి.. సమగ్రంగా అధ్యయనం చేయడం వల్ల ప్రతి అంశంపైనా పట్టు సాధించగలం.

మనం ఏం చదువుతున్నామనే విషయాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలి. పరీక్షల్లో చేసిన తప్పుల వల్ల నిరుత్సాహపడకుండా వాటి నుంచి పాఠం నేర్చుకోవాలి.

ప్రతి పరీక్ష తర్వాత ఎక్కడ తప్పు చేశాం, ఎందులో వెనకబడి ఉన్నాం అనే విషయాలను సమీక్షించుకోవాలి.

మాక్ టెస్టులు రాయాలి. దీనివల్ల పరీక్షల సమయంలో సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలుస్తుంది.

# శివుడికి ప్రసాదంగా డ్రగ్స్..

పోలీసులకు అప్పగించారు.

**ఏం జరిగిందంటే..**

శివరాత్రి రోజున శివుడికి దైవప్రసాదం పేరుతో కొందరు యువకులు మాదకద్రవ్యాలు ప్రదర్శించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోను సీపీ సజ్జనార్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. దేవుడికి మాదకద్రవ్యాలు చూపించడం అత్యంత హేయమైన చర్య అని, వికృతమైన ఉన్మాదమని అన్నారు. "సాహసం చేశామని అనుకుంటున్నారా!? అస్సలు కాదు. ఇది కటకటాల వెనుకకు చేర్చే తీవ్రమైన నేరం! ఒక్కసారి ఎన్‌డీపీఎస్ చట్టం ప్రయోగిస్తే.. జీవితాంతం పశ్చాత్తాపపడాల్సి వస్తుంది. లైకుల కోసం లోకాన్నే మరిచి.. వ్యూస్ కోసం విలువలనే వదిలి.. రీల్స్ కోసం రోడ్డున పడి.. మత్తులో మునిగి.. జీవితాలను నాశనం చేసుకుంటారా? క్షణికానందం ఇచ్చే లైకులు, వ్యూస్ కోసం మీ బంగారు భవిష్యత్తును బలిపెట్టకండి. ఇటువంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించం. బాధ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. సోషల్ మీడియాను మీ సృజనాత్మకతకు వేదికగా మార్చుకోండి.. వ్యసనాలకు వాకిలిగా కాదు" అని పోస్టులో పేర్కొన్నారు. పోలీసులు స్పందించడంతో ఆ విషయాన్ని కూడా సీపీ పోస్టు చేశారు. చట్టం వేసే శిక్ష జీవితకాలం వెంటాడుతుందని హెచ్చరించారు.

# కమల్‌హాసన్ 'ఎంఎన్ఎం' పార్టీకి టార్చిలైట్ గుర్తు

జరగనున్న ఎన్నికల్లో కూడా ఈ పార్టీ ఇదే గుర్తుతో పోటీ చేయనుంది. అవినీతిని నిరోధించడమే లక్ష్యంగా కమల్‌హాసన్ 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించిన సంగతి తెలిసిందే.

# త్వరలో హైదరాబాద్‌లోని ప్రతి జోన్‌లో పర్యటిస్తా..

పోల్స్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ అధికంగా ఉన్న చోట అవసరమైతే పీపీపీ విధానంలో స్కైవాక్‌లు నిర్మించాలన్నారు. హైదరాబాద్‌లో త్వరలో ప్రతి జోన్‌లో పర్యటిస్తానని సీఎం తెలిపారు. రోడ్లు శుభ్రంగా లేకుంటే అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. కమిషనర్లు, జోనల్ కమిషనర్లు పొద్దున్నే ఫీల్డ్‌లో ఉండాలని స్పష్టం చేశారు. ప్రకటన బోర్డుల ఏర్పాటుపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

### నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా
# శనగల కొనుగోళ్లు ప్రారంభం

94,500 మెట్రిక్ టన్నుల శెనగల కొనుగోళ్లకు ధర మద్దతు పథకం అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుండి మంగళవారం ఆదేశాలు అందాయని, నేటి నుంచి CM APP ద్వారా అన్ని జిల్లాల్లో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఉన్న DLPCలు కొనుగోళ్లను పర్యవేక్షిస్తాయని, అవసరమైన మార్గదర్శకాలను ఇప్పటికే జారీ చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్, ఏపీ మార్క్‌ఫెడ్, సివిల్ సప్లైస్ తదితర శాఖల సమన్వయంతో రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతాయని తెలిపారు. PACS, FPOలు, స్వయం సహాయక సంఘాలు వంటి విశ్వసనీయ ఉప-ఏజెన్సీలను రంగంలోకి దింపి పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సీజన్‌లో సుమారు 3.25 లక్షల హెక్టార్లలో శనగల సాగు జరిగిందని, దాదాపు 3.77 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉన్నట్లు మంత్రి వివరించారు. రైతులు తమ ఉత్పత్తిని సమీప RSKలలో నమోదు చేసుకోవాలని, జవీ APP ద్వారా షెడ్యూల్ ప్రకారం కొనుగోళ్లు చేపడతామని తెలిపారు. కొనుగోలు చేసిన శనగలను CWC/SWC గోదాముల్లో నిల్వ చేస్తామని, రైతులకు చెల్లింపులు 15 రోజుల లోపు నేరుగా అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# విజయవాడలో ఘనంగా వెటరన్స్ డే వేడుకలు

### ముఖ్యఅతిథిగా హాజరైన హోం మంత్రి అనిత




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడలో సైనిక్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'వెటరన్స్ డే' వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరై సైనిక వీరులకు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, సైనిక వీరులకు గౌరవ వందనం స్వీకరించడం తనకు అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. యూనిఫామ్‌లో ఉన్నా లేకపోయినా మాజీ సైనికులు సరిహద్దుల్లోనే కాకుండా సమాజంలోనూ, విపత్తుల సమయంలో అందిస్తున్న సేవలు అమోఘమని ప్రశంసించారు. దేశ నిర్మాణంలో వారి సహకారం అమూల్యమని పేర్కొన్నారు. దేశాన్ని కుటుంబం, కులం, మతం కంటే ఎక్కువగా ప్రేమించడం అంటే ఏమిటో మాజీ సైనికులు తమ సేవల ద్వారా దేశానికి చూపించారని అన్నారు. సైనికులతో సమానంగా త్యాగం చేస్తున్న వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మాజీ సైనికుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని వెల్లడించారు. ప్రత్యేకంగా సైనిక్ వెల్ఫేర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి మాజీ సైనికుల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. యువత కూడా మాజీ సైనికుల సేవలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, దేశభక్తి లక్షణాలను పెంపొందించుకోవాలని హోం మంత్రి పిలుపునిచ్చారు.

# ఆ యుద్ధ నౌకలు మునిగిపోవచ్చు

### ట్రంప్‌నకు ఖమేనీ హెచ్చరికలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించబోదన్నారు. అంతేకాదు.. ప్రపంచంలో బలమైన సైనిక శక్తి ఉన్నవాళ్లకూ తీవ్ర ఎదురుదెబ్బ తగలవచ్చన్నారు. ఇరాన్‌లో పాలన మార్పు, యుద్ధ నౌకల మోహరింపుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేశారు. జెనీవా వేదికగా ఇరాన్-అమెరికాల మధ్య పరోక్ష అణు చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. "తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదని అమెరికా అధ్యక్షుడు చెబుతున్నారు. అయితే, ఒక్కోసారి అది కోలుకోలేనంత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఇరాన్ దిశగా యుద్ధ నౌకలను పంపించామని ప్రకటనలు చేస్తున్నారు. ఆ నౌకలు నిజంగా ప్రమాదకరమైనవి. కానీ, వాటిని సముద్రంలో ముంచేసే సామర్థ్యమున్న ఆయుధం మరింత ప్రమాదకరం. 47 ఏళ్లుగా ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏమీ చేయలేకపోయామని అమెరికా అంగీకరించడం శుభపరిణామం. ఎన్నటికీ ఏమీ చేయలేరు. అణు చర్చలు జరుపుదాం అంటున్నారు. కానీ, చివరకు మీ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని చెబుతున్నారు. చర్చల ఫలితాలను ముందుగానే నిర్ధరించడం తప్పిదం, మూర్ఖత్వమే" అని ఖమేనీ వరుస ట్వీట్లలో పేర్కొన్నారు.

**మూడు గంటల్లో ముగిసిన చర్చలు..**

జెనీవా వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన అణు చర్చలు మూడు గంటల్లో ముగిశాయి. చర్చల సమయంలోనే హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సైనిక విన్యాసాలు చేపట్టింది. ఈ సందర్భంగా జలసంధిని కొన్ని గంటల పాటు మూసివేసింది. ఈ క్రమంలో లైవ్ క్షిపణులను ప్రయోగించడం గమనార్హం. ఆ ప్రాంతంలో అమెరికా సైన్యాన్ని మోహరిస్తున్న వేళ టెహ్రాన్ ఈ చర్యలకు ఉపక్రమించింది.

# పిల్లలపై లైంగిక వేధింపులు..

### అమెరికాలో భారతీయుడి అరెస్ట్

**విశ్వం వాయిస్ న్యూస్ :** పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో భారత్‌కు చెందిన ఓ వ్యక్తి అమెరికాలో అరెస్ట్ అయ్యాడు. నిందితుడిని ఓడెల యశస్వీ కొత్తపల్లిగా గుర్తించారు. సరైన పత్రాలు లేకుండా అతడు అగ్రరాజ్యంలోకి ప్రవేశించినట్లు అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ప్రకటన విడుదల చేశారు. న్యూజెర్సీలో 13 ఏళ్ల లోపు చిన్నారులను నిందితుడు లైంగికంగా వేధించినట్లు అభియోగాలు నమోదయ్యాయి. అంతేగాక.. దొంగతనాలు, శాంతి భద్రతలకు భంగం కలిగించడం వంటి నేరాలతోనూ అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే, నిందితుడిపై కేసు ఎక్కడ నమోదైంది?, ఎప్పుడు అరెస్ట్ చేశారు? వంటి పూర్తి వివరాలను మాత్రం అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు వెల్లడించలేదు. ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, అతడిని దేశం నుంచి బహిష్కరించేందుకు న్యాయపరమైన ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. సరైన పత్రాలు లేకుండా అమెరికాలోకి ప్రవేశించారన్న కారణంతో గతేడాది పెద్దసంఖ్యలో భారతీయులను అగ్రరాజ్యం నుంచి వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే. దాదాపు 3,800 మంది భారత పౌరులను అమెరికా స్వదేశానికి తిప్పిపంపింది.

# బిల్‌గేట్స్ పర్యటనపై విషం కక్కుతున్న జగన్: మంత్రి పార్థసారథి

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర అభివృద్ధికి జగన్ వ్యతిరేకి అనే విషయం మరోసారి నిరూపితమైందని ఏపీ మంత్రి పార్థసారథి విమర్శించారు. గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ అమరావతి పర్యటనపై ఆయన విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో మంత్రి మాట్లాడారు. "వైకాపా ఐదేళ్ల పాలన విధ్వంసానికి.. కూటమి పాలన నిర్మాణానికి నిదర్శనం. కూల్చివేతల ఆలోచన ఉన్న జగన్.. అమరావతి నిర్మాణం జరుగుతుంటే ఓర్చుకోలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు విజన్‌ను బిల్‌గేట్స్ పొగడటంతో జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్రం బాగుపడటం ఆయనకు ఇష్టం లేదు. అందుకే బిల్‌గేట్స్ పర్యటనపై బురద చల్లిస్తున్నారు. ఎవరు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా అభివృద్ధిలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు" అని పార్థసారథి అన్నారు.

# ఎడిటర్ వాయిస్

## నేడు సత్యాన్వేషణ దినం

బ్రూనో సంస్మరణార్థం సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని సమర్ధించి, ప్రభోదించినందుకు అగ్నికి ఆహుతైన ఇటాలియన్ తత్వవేత్త.."జోర్డానో బ్రూనో " నేడు వర్ధంతి సందర్భంగా..

ఒక ఇటాలియన్ తత్వవేత్త. బైబిల్‌కి విరుద్ధమైన సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ప్రభోదించినందుకు క్రైస్తవ మత పెద్దలు ఇతన్ని సజీవ దహణం చేశారు. ఇతను కూడా క్రైస్తవ సన్యాసే కానీ ఇతను క్రైస్తవ పెద్దలు ఆమోదించిన భూకేంద్ర సిద్ధాంతాన్ని నమ్మలేదు. ఇతను ప్రతి నక్షత్రం చుట్టూ గ్రహాలు తిరుగుతాయని, ఈ భూమి లాంటి భూములు విశ్వంలో ఇంకెన్నో ఉంటాయని నమ్మేవాడు. 1548లో ఇటలీలో జన్మించిన గ్యియర్దెనో బ్రూనో, కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతానికి తొలిసారిగా ధృవ పరిచినవాడు నికోలాస్ కోపర్నికస్(1473-1543) ఆకర్షితుడైనాడు. 1572లో మతగురువుగా అభిషిక్తుడైన ప్పటికీ, సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. దీనిపై మరింత పరిశీలనలను, పరిశోధనలను చేసి మరిన్ని అదనపు అంశాలను చేర్చి అనంత విశ్వ సిద్ధాంతంను ప్రతిపాదించాడు. బ్రూనో ప్రతిపాదనలు మత విశ్వాసాలకు విరుద్ధమై నవి కదా! మత బోధకులకు కోపం తెప్పించిన అంశం భూమికి, సూర్యునికి అంతం, ఆరంభం ఉంటాయన్నది. బ్రూనోపై 131 అభియోగాలను మోపి 1591లో కేసును నమోదు చేశారు. 1593లో బ్రూనోను గాలి, వెలుతురు చొరబడని ఒక కారా గృహంలో బంధించి ఎన్నో హింసలకు గురిచేశారు. ఈ కారాగారంలో బ్రూనో సుమారు ఏడు సంవత్సరాలకుపైగా నరకయాతన అనుభవించాడు. ప్రతిరోజూ మత గురువుల నుంచి బ్రూనోకు వర్తమానం వచ్చేది. దాని సారాంశం బ్రూనో తన ప్రతిపాదనలు తప్పని ఒప్పుకోవడం, సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ఖండించడం, తాను ప్రచారం చేసిన అంశాలు తప్పని బహిరంగం గా ఒప్పుకోవడం. అయితే ప్రతి రోజూ బ్రూనో ఈ ప్రతిపాదనలు తిరస్కరించేవాడు.చివరకు బ్రూనోను మతద్రోహిగా, సైతానుగా, రెచ్చగొట్టే ఉపన్యాసకుడుగా, మతానికి పరమ శత్రువు గా ప్రకటించి, ఒక్క రక్తంబొట్టు నష్టపోకుండా అగ్నికి ఆహుతి చెయ్యాలన్న మరణశిక్షకు ఆదేశాలు జారీ చేశారు. ఆరోజు 1600 ఫిబ్రవరి 17. మత పెద్దల ఆదేశాల మేరకు ఇనుప సంకెళ్ళతో బ్రూనోను బంధించి, పెడరెక్కలు విరిచికట్టి, తాను నమ్మిన సత్యాన్ని ప్రజలకు చెప్పనీయకుండా ఉండటానికి వీలుగా నాలుకను ఇనుపతీగ లతో చుట్టి, నోటికి అడ్డంగా గుడ్డను కట్టి రోమ్‌నగర వీధుల గుండా ఊరేగిస్తూ మత విశ్వాసాలకు వ్యతిరేకంగా ఏ పని చేసినా వారికి ఈ శిక్ష తప్పదంటూ నినదిస్తూ ఊరేగించారు. బ్రూనో ఆశయాల వల్ల ప్రభావితమైన ప్రజలు వీధిలో బారులుతీరి కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యారు. బ్రూనోను ఊరేగిస్తూ పేద మతసన్యాసులు నివసిస్తున్న భవన సముదాయం మధ్యలో వధ్యశిలగా పిలిచే నిలువెత్తు స్తంభానికి బంధించి అతని నోట కట్టిన గుడ్డను, ఇనుప తీగను తొలగించి తన తప్పును ఒప్పుకున్నా క్షమించి బతకనిస్తా మన్నారు. బ్రూనో నా మరణశిక్ష నాకన్నా మిమ్ములను ఎక్కువ యాతన పెడుతున్నది. దీనికి కారణం నేను పలికే నిజాలు. నేను నమ్మిన సిద్ధాంతం కచ్చితమైనది. సత్యమైనది. నేను ఏ తప్పూ చేయలేదు అని తేల్చి చెప్పాడు. బ్రూనో కాళ్ళ వద్ద ఆముదంలో ముంచిన గుడ్డలను వేసి నిప్పంటించారు. బ్రూనో పాదాలకు మంటలంటుకొని కొద్దికొద్దిగా ఎగిసిపడుతూ శరీర భాగాలను దహించి వేస్తున్నా, తన కనుబొమ్మలు, వెంట్రుకలు కాలుతూ సజీవదహనం అయిపోతూ కూడా సత్యం ఎల్లప్పటికీ శాశ్వతమైనది. విశ్వం గూర్చి సత్యాన్ని త్వరలోనే ప్రజలు తెలుసుకుంటారు అని నినదిస్తూ మరణించా డు. 30 సంవత్సరాల తర్వాత పలువురు మేధావులు దీన్ని తప్పిదంగా గుర్తించి బ్రూనో స్మారకార్థం ఒక స్థూపాన్ని అక్కడ నిర్మించారు. తర్వాతి కాలంలో సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని పలు సవరణలతో ప్రపంచం మొత్తం ఆమోదించింది. బ్రూనో బలిదానానికి గుర్తుగా వైజ్ఞానిక లోకం, విద్యార్థి వర్గాలు, ప్రజా సైన్సు ఉద్యమ కార్య కర్తలు ఫిబ్రవరి 17న సత్యాన్వేషణ దినోత్సవంగా పరిగణిస్తాయి. తమకు తెలియని కాలంలో మానవ సమాజం కొన్ని నమ్మకాలను, విశ్వాసాలను తయారు చేసుకోవచ్చు. కాలక్రమంలో పరిశీలనల వల్ల, ప్రయోగాల వల్ల ఆ నమ్మకాల, విశ్వాసాల డొల్లతనం బయటపడవచ్చు. రుజువైన సత్యాన్ని మతం పేరుతో, సంప్రదాయం పేరు తో తిరస్కరించే శక్తులు అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ ఉంటాయి. వీరిని ఎదుర్కొని సత్యాన్ని ముందుకు తీసుకెళ్లిన ప్పుడే సమాజం అభివృద్ధి వైపు ప్రయాణిస్తుంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## కర్ణాటకలో ముగ్గురు నిందితులకు ఉరిశిక్ష

**ఇజ్రాయెల్ టూరిస్ట్, హోంస్టే యజమానురాలిపై అత్యాచారంతో పాటు మరొకరి హత్య**
**సంచలన తీర్పు వెలువరించిన గంగావతి అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం**
**11 నెలల్లోనే విచారణ పూర్తిచేసి శిక్ష ఖరారు**
**ఉరిశిక్ష పడ్డ నిందితులు చేతన్‌సాయి, హంది మల్ల, శరణప్ప**



**గంగావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలోని హంపి సమీపంలో పర్యాటకులపై దాడి, అత్యాచారం, హత్య కేసులో గంగావతి అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న హంది మల్ల, చేతన్‌సాయి, శరణప్పలకు మరణశిక్ష విధించింది. ఈ నెల 6న వారిని దోషులుగా నిర్ధారించిన న్యాయస్థానం సోమవారం శిక్ష ఖరారు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం.. గతేడాది మార్చి 6న ఇజ్రాయెల్‌కు చెందిన ఓ మహిళ, అమెరికాకు చెందిన డేనియల్, మహారాష్ట్రకు చెందిన పంకజ్, ఒడిశాకు చెందిన బిబాస్ విడివిడిగా హంపి పర్యటనకు వచ్చారు. వీరందరూ హనుమనగుల్లిలో ఓ మహిళ నిర్వహిస్తున్న హోంస్టేలో బస చేశారు. అదే రోజు రాత్రి స్థానికంగా సణాపుర సరోవరం పరిసరాల్లోని రంగాపుర గంగమ్మ ఆలయం వద్ద సంగీత కార్యక్రమం నిర్వహించుకోవడానికి ఆ ఐదుగురు కలిసి వెళ్లారు. ఈ సమయంలో విప్ర సాయినగర్‌కు చెందిన ముగ్గురు యువకులు హంది మల్ల, చేతన్‌సాయి, శరణప్ప ద్విచక్రవాహనంపై అక్కడికి వచ్చారు. తమ వాహనంలో పెట్రోల్ లేదని, దానికోసం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్యాటకులు నిరాకరించడంతో దాడి చేసి బిబాస్, పంకజ్, డేనియల్‌ను తుంగభద్ర ఎడమ కాలువలోకి తోశారు. వారు నీటిలో కొట్టుకుపోగానే విదేశీ మహిళ, హోంస్టే యజమానురాలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కాలువలోకి తోసిన వారిలో బిబాస్ మృతిచెందగా మిగతా ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. గంగావతి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్టు చేశారు. ఘటన జరిగినప్పటి నుంచి 11 నెలల్లోనే విచారణ పూర్తి చేశారు. ఈ కేసులో 101 మంది సాక్షులను విచారించారు. ఈ మేరకు న్యాయమూర్తి సదానంద నాగప్పనాయక.. నిందితులకు మరణశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

## ప్రియుడి కోసం.. మృత్యు నాటకం

**హాసన, విశ్వం వాయిస్ న్యూస్ :** భర్తను మోసగించి ప్రియుడితో వెళ్లిపోవాలనుకున్న ఓ మహిళ.. తాను చనిపోయినట్లు నాటకం ఆడి పోలీసులకు దొరికిపోయింది. ఈ ఘటన కర్ణాటకలో చోటుచేసుకొంది. తుమకూరు జిల్లా కుణిగల్‌కు చెందిన ప్రియాంక(29)కు చిక్కమగళూరుకు చెందిన వ్యక్తితో రెండేళ్ల క్రితం వివాహమైంది. గత శుక్రవారం హాసన తాలుకా కల్కెర గ్రామంలో జరుగుతున్న స్నేహితురాలి పెళ్లికి ప్రియాంక వెళ్లింది. అందరూ వివాహ హడావుడిలో ఉండగా స్థానికంగా ఉన్న ఓ కాల్వగట్టున ఆమె దుస్తులు, పాదరక్షలు, ఇతర సామగ్రిని వదిలేసి పారిపోయింది. దీంతో తాను మరణించినట్లు భర్త భావిస్తారని ప్రియాంక అంచనా వేసింది. ఈ విషయం తెలియగానే భార్య కనిపించట్లేదంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రియాంక ఒంటిపై రూ.30 లక్షల విలువైన ఆభరణాలు ఉన్నాయని, వాటిని కాజేయడానికి హత్య చేసి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారించిన పోలీసులు బేలూరు బస్టాండ్ వద్ద సీసీకెమెరా ఫుటేజ్‌లో ఆమెను గుర్తించారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ప్రియుడు డేవిడ్ దగ్గర ఉన్నట్లు నిర్ధారించుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

## విష ప్రయోగంతో 26 వలస పక్షుల మృతి

**కుమురంభీం జిల్లాలో నలుగురి అరెస్టు**

**పెంచికల్‌పేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు చెరువు వద్ద... 26 వలస పక్షులు వేటగాళ్ల విషపు ఎరకు బలయ్యాయి. బాధ్యులైన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన ప్రకాశ్ సర్కార్, కుశాల్ మండల్, తుషార్‌దేయ్, తరఫ్దార్ సంజిత్‌లు పెంచికల్‌పేట్ మండలంలోని లోడ్పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు వచ్చారు. ఈ నెల 13న వీరు ఎల్లూరు చెరువు వద్ద వడ్ల గింజల్లో పురుగుమందు కలిపి తామర ఆకులపై ఉంచారు. వాటిని తిన్న పక్షులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. వాటిని వండుకుని తినడానికి, అమ్మడానికి సంచుల్లో నింపారు. 14న సమాచారం అందుకున్న బీట్ అధికారి సతీశ్ వారిని పట్టుకున్నారు. వారివద్ద 19 నార్తర్న్ పిన్‌టైల్స్, ఏడు గ్రే-హెడెడ్ స్వాంప్‌హెన్ పక్షుల కళేబరాలను స్వాధీనం చేసుకున్నారు. వెటర్నరీ వైద్యుల సమక్షంలో వాటికి పోస్టుమార్టం నిర్వహించారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించిందని ఎఫ్‌ఆర్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

## బీరువా ఎత్తుకెళ్లిన దొంగలు



**కామారెడ్డి, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాకేంద్రం వినాయక్ నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శమీము న్నీసాబేగం తాళం వేసి బయటకు వెళ్లారు. తాళాలు పగులగొట్టి ఇంట్లోకి దొంగలు చొరబడి బీరువాను ఎత్తుకెళ్లారు. అందులో 2 తులాల బంగారం, కొంత నగదు ఉన్నట్లు బాధితులు తెలిపారు. ఈ విషయమై 100కి సమాచారం ఇవ్వగా పోలీసు సిబ్బంది చేరుకుని ఘటనపై ఆరా తీశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి వివరాలు సేకరించారు.

మంచినీళ్లు కావాలంటూ వచ్చి..

## చోరీ చేసిన మహిళలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** అపరిచితులైనా సరే మంచినీళ్లంటూ వస్తే గుక్కెడు నీళ్లిస్తాం! ఆకలేస్తోందని అడిగితే జాలిపడతాం. అలా గుడ్డిగా నమ్మిన దంపతులు కొందరు మహిళల చేతిలో మోసపోయారు. మంచినీళ్లు కావాలని వచ్చిన మహిళలు.. దంపతులను మాటల్లో పెట్టేసి ఇంట్లో ఉన్న ట్రంకుపెట్టెను ఎత్తుకెళ్లారు. ఫిబ్రవరి 7న కర్నూలులోని లక్కీఫాం నర్సరీలో ఈ ఘటన జరిగింది. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నర్సరీ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ పెట్టెలో 2 తులాల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి, రూ.5 వేల నగదు ఉన్నాయని తెలిపారు. నిందితులను బిహార్‌కు చెందిన ముఠాగా గుర్తించిన పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

మదనపల్లెలో విషాదం..

## అదృశ్యమైన బాలిక మృతదేహం గుర్తింపు

**మదనపల్లె, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నమయ్య జిల్లా మదనపల్లెలో విషాదం చోటుచేసుకుంది. అదృశ్యమైన ఏడేళ్ల బాలిక మృతదేహాన్ని ఎదురుగా ఉన్న కులవర్ధన్ అనే వ్యక్తి ఇంట్లోనే గుర్తించారు. అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కులవర్ధన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గతంలోనూ స్థానిక మహిళలతో అతడు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మదనపల్లె ఒకటో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు.

## ఇంట్లోనే మృతదేహం.. అడిగితే ఆగ్రహం


**ప్రార్థనలు చేస్తున్నామంటూ వాగ్వాదం**
**అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదుతో పోలీసుల రంగప్రవేశం**

**మూసాపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నాలుగు రోజులుగా మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించకుండా ఇంట్లోనే ఉంచి.. ప్రార్థనలు చేస్తున్నామంటూ వింతగా మాట్లాడిన కుటుంబంపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం... ఏపీలోని ఏలూరుకు చెందిన ఏసురత్నం కుటుంబం 40 ఏళ్ల క్రితం నగరానికి వచ్చారు. ఏఎస్సైగా పనిచేసిన ఆయన పదేళ్ల క్రితం చనిపోయారు. ప్రస్తుతం ఆయన భార్య శమంతకమణితోపాటు ఇద్దరు కుమార్తెలు సునీత, శైలజ(46), కుమారుడు జయరాజ్‌లు కూకట్‌పల్లి రామకృష్ణానగర్‌లోని శ్రీసాయి భరద్వాజ్ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నారు. ముగ్గురు పిల్లలకు ఇప్పటి వరకు వివాహం కాలేదు. వారం రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న చిన్న కుమార్తె శైలజను స్థానికంగా ఓ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఈ నెల 13న చనిపోయింది. అదే రోజు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. శవాలను భద్రపరిచే రిఫ్రిజిరేటర్‌ను కూడా తెప్పించి మృతదేహాన్ని అందులో పెట్టి తలుపులు బిగించుకుని ఇంట్లోనే ఉంటున్నారు. అప్పుడప్పుడు తమ సొంత పనులపై బయటకు వెళ్లివస్తున్నారని స్థానికులు తెలిపారు. అంత్యక్రియల నిర్వహణ గురించి పట్టించుకోకపోతుం డటంతో ఇరుగుపొరుగు కలగచేసుకుని ఆ కుటుంబ సభ్యులను నిలదీశారు. 'మేము ప్రార్థనలు చేసుకుంటున్నాం.. అంత్యక్రియలు మా ఇష్టం వచ్చినపుడు చేసుకుంటాం.. అడగడానికి మీరెవరు?' అంటూ స్థానికులతో గొడవకు దిగారు. పైగా వారింట్లోంచి దుర్వాసన కూడా వస్తుండటంతో స్థానికులు సోమవారం కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులకు సైతం ఆ కుటుంబం చుక్కలు చూపించింది. ఎంతకీ తలుపులు తీయలేదు. చివరకు పోలీసులతో సైతం 'మా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాం.. అడగడానికి మీరెవరు?' అంటూ వాగ్వాదానికి దిగారు. అంత్యక్రియలు నిర్వహించకుంటే తామే జీహెచ్‌ఎంసీకి అప్పగించి కార్యక్రమం పూర్తిచేస్తామని పోలీసులు హెచ్చరించడంతో దిగొచ్చారు. పోలీసుల జోక్యంతో శైలజ మృతదేహాన్ని సొంతూరుకు తరలించారు. కాగా మృతురాలి మానసిక పరిస్థితి సరిగా లేదని, మృతురాలి కుటుంబం ఎవరితోనూ కలవరని, మాట్లాడరని భిన్నమైన జీవితాన్ని గడుపుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.

# బిజినెస్ వాయిస్

## వెండి కొనాలనుకుంటున్నారా?

### అయితే ఇదే రైట్ టైమ్! ధర ఎంత తగ్గిందో తెలుసా..?



ఫిబ్రవరి 12 నుండి వెండి ధరలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ఇప్పటి వరకు వెండి ధర రూ.23,000 పైగా తగ్గింది. ఇంతలో రెండు రోజుల లాభాల తర్వాత బంగారం ధరలు తగ్గాయి. డేటా ప్రకారం ఢిల్లీలో మంగళవారం బంగారం, వెండి ధరలు 2 శాతం తగ్గాయి. బలహీనమైన ప్రపంచ మార్కెట్ సంకేతాల కారణంగా వెండి ధరలు కిలోగ్రాముకు రూ.2.45 లక్షలకు, బంగారం ధరలు రూ.10 గ్రాములకు 1.57 లక్షలకు పడిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీలో వెండి, బంగారం ధరలు ఎలా మారాయో కూడా మీకు తెలియజేద్దాం.. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం.. తెల్ల లోహం (బంగారం) ధర రూ.5,000 లేదా 2 శాతం తగ్గి, కిలోగ్రాముకు రూ.2,45,000 (అన్ని పన్నులతో సహా) కు చేరుకుంది, సోమవారం ముగింపు ధర కిలోగ్రాముకు రూ.2,50,000 నుండి. గణనీయంగా ఫిబ్రవరి 12 నుండి వెండి ధరలు రూ.23,500 తగ్గాయి. ఫిబ్రవరి 12న ఢిల్లీ బులియన్ మార్కెట్లో ఎటువంటి మార్పు లేదు మరియు ధర రూ.2,68,500 వద్ద ఉంది. బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర 10 గ్రాములకు రూ.2,200 లేదా 1.4 శాతం తగ్గి రూ.1,57,000కి చేరుకుంది (అన్ని పన్నులతో సహా). గత సెషన్‌లో ఈ బంగారం ధర 10 గ్రాములకు రూ.1,59,200గా ఉంది. సెలవులు, అమెరికా ద్రవ్యోల్బణం గణాంకాల కారణంగా ఆసియా మార్కెట్లలో ద్రవ్యత తక్కువగా ఉండటం వల్ల ఫెడరల్ రిజర్వ్ భవిష్యత్తులో వడ్డీ రేటును తగ్గిస్తుందనే అంచనాలను పెంచిందని ఛాయిస్ బ్రోకింగ్‌లోని కమోడిటీ విశ్లేషకురాలు కావేరి మోర్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ వెండి ఔన్సుకు 1.65 డాలర్లు లేదా 2.15 శాతం తగ్గి 74.96 డాలర్లకు చేరుకోగా, బంగారం ఔన్సుకు 1.04 శాతం తగ్గి 4,938.70 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మంగళవారం జెనీవాలో ప్రారంభం కానున్న అమెరికా-ఇరాన్ చర్చలకు ముందు పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరించడంతో స్పాట్ బంగారం వరుసగా రెండవ రోజు కూడా తగ్గుతూనే ఉందని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ అండ్ కరెన్సీ హెడ్ ప్రవీణ్ సింగ్ అన్నారు. చైనాలో చంద్ర నూతన సంవత్సర సెలవులు ప్రారంభం కావడంతో లోహానికి మద్దతు బలహీనపడటంతో 5,000 డాలర్ల స్థాయికి మించి బంగారం "పెళుసైన పట్టు" మంగళవారం మళ్లీ అమ్మకాల ఒత్తిడికి దారితీసిందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ అన్నారు.

## అత్యధిక వడ్డీ అందించే స్కీమ్..!


### కేవలం రూ.1000 నుంచి పెట్టుబడి స్టార్ట్ చేయొచ్చు!



సురక్షిత పెట్టుబడి, స్థిరమైన ఆదాయం కోరుకునే వృద్ధులకు పోస్టాఫీసు సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ అద్భుతమైన ఎంపిక. ప్రస్తుతం 8.2 శాతం అధిక వడ్డీతో, ఇది అనేక బ్యాంక్ ఖీణల కంటే మెరుగ్గా ఉంది. సెక్షన్ 80జ కింద పన్ను మినహాయింపు ప్రయోజనాలను కూడా కల్పిస్తుంది.సురక్షిత పెట్టుబడి, స్థిరమైన ఆదాయం కోరుకునే వృద్ధులకు పోస్టాఫీసు పథకాలు మంచి ఎంపికగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా Senior Citizens Savings Scheme పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రతను కల్పించే ప్రజాదరణ పొందిన పథకం. ప్రస్తుతం ఈ పథకంపై ప్రభుత్వం సంవత్సరానికి 8.2 శాతం వడ్డీ రేటును అందిస్తోంది. ఇది అనేక బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల కంటే ఎక్కువగా ఉండటం విశేషం. ఈ పథకంలో కనీసంగా రూ.1,000తో ఖాతా ప్రారంభించవచ్చు. గరిష్ట పెట్టుబడి పరిమితి రూ.30 లక్షలు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80C కింద సంవత్సరానికి రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. 60 సంవత్సరాలు పైబడిన వారు వ్యక్తిగతంగా లేదా జీవిత భాగస్వామితో కలిసి జాయింట్ ఖాతా తెరవవచ్చు. అలాగే 55-60 సంవత్సరాల మధ్య వయస్సు గల VRS ఉద్యోగులు, 50-60 సంవత్సరాల మధ్య రిటైర్డ్ రక్షణ సిబ్బంది కూడా నిబంధనల ప్రకారం పెట్టుబడి పెట్టవచ్చు. ఈ పథకపు మెచ్యూరిటీ కాలం 5 సంవత్సరాలు. అవసరమైతే మరిన్ని 3 సంవత్సరాలు పొడిగించుకునే అవకాశం ఉంది. ప్రతి త్రైమాసికానికి వడ్డీ చెల్లింపు జరుగుతుంది. అయితే గడువు పూర్తికాకముందే ఖాతా క్లోజ్ చేస్తే జరిమానా ఉంటుంది. ఉదాహరణకు రూ.25 లక్షలు 8.2 శాతం వడ్డీతో పెట్టుబడి పెడితే, సంవత్సరానికి సుమారు రూ.2,05,000 వడ్డీ వస్తుంది. అంటే త్రైమాసికానికి రూ.51,250, నెలకు సుమారు రూ.17,083 ఆదాయం లభిస్తుంది. ఒకసారి పెట్టుబడి చేసిన తర్వాత ఆ కాలానికి వడ్డీ రేటు స్థిరంగా ఉంటుంది. దీంతో రిస్క్ లేకుండా స్థిరమైన ఆదాయం పొందవచ్చు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 18 ఫిబ్రవరి 2026

www.viswamvoice.com




# వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 లక్ష్య సాధనకు దోహదం

**సంక్షేమం, అభివృద్ధి సమతుల్యం గల బడ్జెట్ - అప్పులను తగ్గించి, ఆస్తులను సృష్టించే ఆర్థిక క్రమశిక్షణ గల బడ్జెట్**

**రాష్ట్రానికి బిల్ గేట్స్ రావడం సీఎం చంద్రబాబు ఘనత - అసెంబ్లీలో బడ్జెట్ పై చర్చలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్ర పురోగతికి పునాది లాంటిదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బడ్జెట్ పై చర్చలో భాగంగా స్పీకర్ స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు పేరు పిలవడంతో ఎమ్మెల్యే వాసు చర్చలో పాల్గొంటూ తన స్పందన తెలియజేశారు. గతంలో ఐదేళ్ల అస్తవ్యస్త పాలనను గాడిన పెట్టే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని అన్నారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత నిస్తూ, వికసిత ఆంధ్రప్రదేశ్ 2047లక్ష్య సాధనకు దోహదం చేసే బలమైన అడుగులా ఈ బడ్జెట్ ఉందన్నారు. ఈ భర్తీ బడ్జెట్ లో ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా చేసారని అన్నారు. ఒక పక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమంతో సమతుల్యంలో ఈ బడ్జెట్ ఉందని ఎమ్మెల్యే వాసు అన్నారు. ఇంటికి పునాది ఎంత ముఖ్యమో రాష్ట్రం బాగుండాలంటే విద్య, వైద్యం, సంక్షేమం కూడా అంతేముఖ్యమని ఆయన పేర్కొన్నారు. విద్యకు రూ 32,308కోట్లు, బిసి సంక్షేమానికి రూ 23, 650కోట్లు, ఆరోగ్యానికి రూ 19, 306కోట్లను కేటాయించారని ఆయన వివరించారు. గత ప్రభుత్వానికి , కూటమి ప్రభుత్వానికి గల తేడా ఆర్థిక క్రమశిక్షణ అని ఆయన స్పష్టంచేసారు. గత బడ్జెట్ తో పోలిస్తే కేపిటల్ రిసీప్ట్స్ 6. 05శాతానికి తగ్గడం శుభ సూచకమని ఎమ్మెల్యే వాసు అన్నారు. రెవెన్యూ పెరగడం కూడా గొప్ప పరిణామంగా ఆయన పేర్కొన్నారు. అప్పులను తగ్గించి ఆస్తులను సృష్టించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే వాసు సంతోషం వ్యక్తంచేసారు. కేపిటల్ వ్యయం కూడా 19. 84శాతం పెరిగడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. స్వర్ణాంధ్ర



2047కోసం పది లక్ష్యాలను నిర్దేశించుకున్న నేపథ్యంలో అమరావతికి రూ 6000కోట్లు కేటాయించడం హర్షణీయమని అన్నారు. గడిచిన ఐదేళ్లుగా రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందని, ఇప్పుడు రాజధానిపై దృష్టి పెట్టడం వలన ప్రపంచంలో చాలా దేశాలు గర్విస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు హయాంలోనే అమరావతికి మంచి రూపు రేఖలు వస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు. అమరావతితో పాటు సమాంతరంగా అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత నిస్తూ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వాసు ఆనందం వ్యక్తంచేసారు. భోగాపురం ఎయిర్ పోర్టుకి రూ 155కోట్లు, మచిలీపట్టణం పోర్టు, హార్బర్‌కి రూ.150కోట్లు, రామాయపట్నం పోర్టుకి రూ 100కోట్లు, భావనపాడు పోర్టుకి రూ 100కోట్లు కేటాయించడాన్ని ఎమ్మెల్యే వాసు ప్రస్తావించారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో నిరాదరణకు గురైన బడుగు బలహీన వర్గాల ఆదరణ పథకానికి రూ 1000కోట్లు కేటాయించడం అభినందనీయమని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం పథకంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ వర్తింపజేయడం వంటి సంక్షేమ పథకాలకు బడ్జెట్ లో ప్రాధాన్యత ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. విద్యారంగానికి సంబంధించి గత ప్రభుత్వంలో వాళ్ళ బొమ్మలు వేసుకుని ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తే, కూటమి ప్రభుత్వంలో మంత్రి లోకేష్ సారథ్యంలో అందరికీ స్ఫూర్తిదాయకంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ స్కూల్ కిడ్స్, మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరుతో నిర్వహించడం వంటివి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. యూనివర్సిటీస్ లో అడ్వాన్స్ ఎడ్యుకేషన్ వంటివాటికి ప్రాధాన్యత ఇస్తూ, రూ 2566కోట్లు కేటాయింపు చేయడం హర్షనీయమని అన్నారు. బిల్ గేట్స్ 1995లో ఆంధ్రప్రదేశ్ కి రావడానికి, ఇప్పుడు మళ్ళీ రావడానికి విజనరీ సీఎం చంద్రబాబు కారణమని ఎమ్మెల్యే వాసు అన్నారు. ఇలాంటి ప్రముఖులు గత ప్రభుత్వంలో ఈ రాష్ట్రము వైపు చూడాలంటేనే భయపడేవారని, పైగా ఇక్కడ నుంచి పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించుకుని పారిపోయే పరిస్థితి కల్పించారని ఆయన అన్నారు. అరుదైన ఖనిజాల అభివృద్ధి, హైస్పీడ్ రైల్ కారిడార్లు, పరిశ్రమల విస్తరణ, పర్యాటక రంగానికి ప్రాధాన్యత కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఇంత చక్కటి బడ్జెట్ పెట్టిన మంత్రి పయ్యావుల కేశవ్ కి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అభినందనలు తెలిపారు.

# చెట్లను కాపాడే అధికారులే వాటికి భక్షకులుగా తయారయ్యారు

**గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు - పర్యావరణ సమతుల్యతకు నష్టం వాటిల్లుతుందని సంగతి మరిచితే ఎలా...**

**ప్రజా శ్రేయస్సుకు ప్రజాప్రతినిధుల ఆశయాలకు తూట్లు : కౌన్సిలర్ మందపల్లి రవి**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రభుత్వాలు ఒకపక్క మొక్కలు నాటడానికి ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతుంటే పచ్చని చెట్లను కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులే వాటిని తొలగించడానికి ఆదేశాలు ఇచ్చిన తీరు మండపేటలో ఏర్పడింది. చట్టాలను అమలు చేసేవారే చట్టాలను తుంగలోకి తొక్కి నిర్లక్ష్యం గా పచ్చని నీడ ఇచ్చే 18 చెట్లు క్రూరంగా తొలగించారు. దీనిపై పర్యావరణ ప్రేమికులు గ్రీన్ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేస్తున్నట్లు సమాచారం.ఏడు, ఎనిమిది వార్డు ల పరిధిలో దళిత పేట లో ఎంపీడీఓ, అర్బన్ హెల్త్ సెంటర్ లు ఉన్నాయి. ఈ కార్యాలయాలు ఏర్పడి 40 ఏళ్లు పై మాటే. అప్పటి నుండి ఉన్న వేప, టేకు చెట్లు పెరిగి మహా వృక్షాలు గా ఉన్నాయి. ఇక్కడికి వచ్చే వారికి నీడ ను ఇస్తున్నాయి. కాగా మంగళవారం ఈ చెట్లను ఎలాటి అనుమతులు లేకుండా నరికేశారు. స్థానికులు ఫిర్యాదు మేరకు మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లి ఎంపీడీఓ కే సత్యనారాయణ ను వివరణ అడిగారు. ఎంపీడీఓ కార్యాలయం పై కొత్తగా సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నామని వాటికి ఈ కొమ్మలు అడ్డుగా ఉంటాయనే ఉద్దేశ్యం తో తొలగిస్తున్నట్లు వివరణ ఇచ్చారు. అటవీ, ఇతర శాఖల అనుమతులు తీసుకున్నారా అని ప్రశ్నిస్తే ఎలాటి అనుమతులు తీసుకోలేదని చెప్పారు.నిబంధనలు మేర వ్యవహరించాల్సిన అధికారులే



ఇలా అడ్డగోలుగా వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకునేలా చేస్తామని పర్యావరణ పరిరక్షణ సభ్యులు చెప్పారు. ప్రజా శ్రేయస్సుకు ఆసుపత్రికి వచ్చే రోగులకు నీడనిచ్చే విధంగా గత ప్రజా ప్రతినిధులు మొక్కలను నాటడం జరిగిందని, ఆసుపత్రి కమిటీ చైర్మన్‌గా తాను ఉండగా కమిటీ తీర్మానాలు ఏమీ లేకుండా ఏ విధంగా తొలగించారని దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ పేర్కొన్నారు. ఒక చెట్టును నరకడం వల్ల పర్యావరణ సమతుల్యతకు రూ.15.70 లక్షల విలువ నష్టమవుతుంది. మొత్తం మీద ఒక చెట్టు నిజమైన విలువ మొత్తం రూ. 16 లక్షలు అవుతుందని తెలుసుకోవాలి. వాతావరణ



సమతుల్యతను కాపాడేందుకు 50 ఏళ్లకు పైబడిన చెట్లను నరకరాదని 2012లో ఒక నిబంధన ప్రభుత్వాల నుంచి వెలువడింది. దేశంలో చెట్లను పరిరక్షించే చట్టం 1994లో అమలులోకి వచ్చింది. క్రీస్తుపూర్వం 268 లోనే అశోకుడు చెట్లు నాటించాడని శాసనాలు చెబుతున్నాయి. రైతులు తమ పొలాల గట్లపై వృథా భూముల్లో ముల్లో, ఏగిస, మద్ది, తుమ్మ, వేప, నేరేడు, మర్రి, రావి చెట్లను పెంచితే ఉష్ణోగ్రత 3 నుండి 4 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు తగ్గుతుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ప్రతివ్యక్తి పది మొక్కలు నాటి అవి పెరిగి పెద్దదయ్యేలా శ్రద్ధ వహించాలని, పర్యావరణానికి మనం ఏదైతే చేస్తామో , పర్యావరణం నుండి తిరిగి అదే మనం పొందుతామని శాస్త్రవేత్త ఎపిజె కలాం సూచనలు గుర్తు తెచ్చుకోవడం ఎంతో అవసరం అని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.

పిల్లలలో ఎదుగుదల హరించే

# నులిపురుగుల నివారణ తప్పనిసరి

**ఆరు నెలలకు ఒకసారి ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ**

**విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రతను పాటించాలి : డాక్టర్ అనిరుధ్**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** చిన్నారులలో ఎదుగుదలకు అవరోధంగా నిలిచే నులిపురుగుల నివారణకు అందరూ సహకరించాలని మండల విద్యాశాఖ అధికారి వై సూర్యనారాయణ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలోనూ ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో 1 నుండి 19 ఏళ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేసారు. స్థానిక శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి డాక్టర్ అనిరుధ్ ఆధ్వర్యంలో ఎంఈవో సూర్యనారాయణ మాత్రలను అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పిల్లలలో ఎదుగుదలను నులిపురుగులు హరించివేస్తాయని, దాని కోసమే ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఫిబ్రవరి, ఆగష్టు నెలలలో ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు ఉచితంగా అందిస్తుందని ఈ కార్యక్రమానికి అందరు సహకరించాలని కోరారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ అనిరుధ్ మాట్లాడుతూ నులి పురుగుల నివారణకు జాగ్రత్త వహించాలని, విద్యార్థులు తప్పనిసరిగా ప్రతిరోజు ఆహారానికి ముందు, మల విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం, గోళ్లను క్రమం తప్పకుండా కత్తిరించుకోవడం, బయట చెప్పులు ధరించడం వంటివి పాటించాలని వివరించారు. ఆల్బెండజోల్ మాత్రలు రక్తహీనత, అలసట, కడుపు నొప్పి, పోషకాహార లోపం వంటి సమస్యలను నివారించడంలో సహకరిస్తాయని వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శాంతి సునీత తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మత్తు నిండు జీవితాన్ని

# చిత్తు చేస్తుంది

**రాయవరంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం, ర్యాలీ**

**పలు సూచనలు చేసిన ఎస్సై సురేష్ బాబు, డాక్టర్ అనిరుధ్**




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డ్రగ్స్ అంటే మాదకద్రవ్యాల వినియోగం వలన యువత భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుందని డ్రగ్స్ వినియోగంపై అవగాహన కలిగి దూరంగా ఉండడం ప్రతి విద్యార్థి బాధ్యత అనే రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన రాయవరంలో గల శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శాంతి సునీత ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయవరం ఎస్సై సురేష్ బాబు, మండల విద్యాశాఖ అధికారి సూర్యనారాయణ, పిహెచ్‌సి డాక్టర్ అనిరుద్ లు అతిథులుగా పాల్గొని డ్రగ్స్ వినియోగం ఎంత ప్రమాదకరమో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సందర్భంగా ఎస్ఐ సురేష్ బాబు మాట్లాడుతూ చెడు సహవాసాలకు అలవాటు పడిన యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, డ్రగ్స్ అలవాటు మనిషిలో మానవత్వాన్ని హరించి, దుర్మార్గంగా వ్యవహరించేలా చేస్తుందని, యువత డ్రగ్స్ మత్తులో ఆకృత్యాలకు పాల్పడి జీవితకాలం కారాగారం పాలవుతున్నారని కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారని వివరించారు ర్యాలీని నిర్వహించి విద్యార్థులతో డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు జోలికి పోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రాయవరం 1 మహిళా పోలీస్ కె. పద్మ సుధ, రాయవరం 2 మహిళా పోలీస్ యు. సురేఖ, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో రోడ్లకు మహర్దశ : కోన సత్యనారాయణ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో రోడ్లకు మహర్దశ పట్టిందని బిజెపి సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ తెలిపారు. పల్లె రోడ్లకు పండగొచ్చిందన్నారు. గుంతలకు రోడ్లకు చెక్ పెట్టారని పేర్కొన్నారు. వేలకోట్లతో రోడ్ల పునర్నిర్మాణం చేపట్టారని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో రోడ్లమరమ్మత్తులకు గుప్పెడుమట్టి,పైసా విదల్చకపోవడంతో గ్రామీణ,పట్టణ రహదారులన్నీ చిద్రమయ్యాయనీ వాపోయారు. గతంలో గుంతల రోడ్లపై నిత్య ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకున్నా నాధుడే కరువయ్యాడని ఆరోపించారు.కూటమి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల అభివృద్ధి పై దృష్టి సారించిందని తాజా గా బడ్జెట్‌లో 3,237 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. పట్టణ,పల్లెల్లో గుంతల లేని రోడ్లపై ప్రజలు ప్రయాణం చేస్తారని తెలిపారు.ఏపి రాష్ట్ర వ్యాప్తంగా గుంతల రహితంగా మార్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోన కృతజ్ఞతలు తెలిపారు.

# గుమ్ములూరులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు నులిపురుగుల పట్ల అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని గుమ్ములూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాభవాని అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోరుకొండ, దోసకాయలపల్లి, కోటి కేశవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల్లోని పిల్లలకు నులిపురుగులపై అవగాహన కల్పించి, నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు కోరుకొండ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ జ్ఞానచంద్ర, కోటి కేశవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి డాక్టర్ కిల్లి కృష్ణవేణి తెలిపారు.ప్రతీ సంవత్సరం ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోలు మాత్రలు వేసుకోవడం వల్ల పిల్లలకు రక్తహీనత రాదని, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారులు విద్యార్థిని,విద్యార్థులకు వివరించారు. గోళ్ళు పెంచుకోవడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జ్ఞాన చంద్ర, డాక్టర్ కృష్ణవేణి, గుమ్ములూరు ఉపాధ్యాయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్,కోరుకొండ, కోటి కేశవరం, దోసకాయలపల్లి పిహెచ్సి సూపెర్వైజర్స్, అంగన్వాడీ సూపెర్వైజర్స్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం లోని వివిధ అనారోగ్యాల కారణంగా చికిత్స పొందిన పలువురికి స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇనుగంటి వారి పేట గ్రామానికి చెందిన దాక్షాయణి సమయంతి కి రూ.26,477/లు, కొత్తపల్లి వెంకటరత్నంకు రూ.27,798/- లు, ముగ్గళ్ళ గ్రామానికి చెందిన ఈతకోటి రాజేష్ కు 56,080/లు,షేక్ ఖాసింబిబికు రూ. 77 4701/ లు, అప్పరబోతు లక్ష్మీ శరణ్యకు రూ.23,400/- లు, బస్వా సత్యవతికి రూ.29,162/- లు, రఘుదేవపురం గ్రామానికి చెందిన పంతుల ఆనందరాజు రూ.56,309/- లు, పుట్ట శివరాంకు రూ.35000/- లు, ఈరాట వెంకట గోపికి రూ. 82,258/- లు, నగేరు సోమరాజుకు 30000/ - లు, లుగలాపు సత్యనారాయణకు రూ.64995/- లు, మద్దాల పోసి రత్నం కు రూ.22,714/- లు, పంతుల సాయి వెంకట్ కు రూ.36084/- లు, ప్రగడ నాగు కు 21,384/- లు, రాపాక గ్రామానికి చెందిన ఉల్లి లక్ష్మికు రూ.56,309/- లచెక్కులను బత్తుల వెంకటలక్ష్మి స్వయంగా ఇంటికి వెళ్లి అందించారు.ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి,బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఓలు నిరసన



**సమస్యలను తక్షణం పరిష్కరించాలి**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** వీఆర్వోల సమస్యలను తక్షణం పరిష్కరణ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విఆర్ఓల సంఘం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గౌరవ అధ్యక్షులు , ఏపీ అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మద్దాల బాపూజీ డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ హాజరు, ఫ్యామిలీ సర్వేలనుండి విఆర్ఓలను మినహాయించాలని డిమాండ్ చేశారు.పని ఒత్తిడి అధికారులు వేధింపులు విఆర్ఓల అకస్మిక మరణాలపై నిరసన వ్యక్తం చేశారు. మండపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద భోజన విరామసమయంలో విఆర్ఓలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియచేసారు. బయోమెట్రిక్ హాజరు నుండి, సచివాలయాల క్లస్టర్ సర్వేల నుండి విఆర్ఓలను మినహాయించాలని కోరారు. రాష్ట్ర నాయకతవాన్ని చర్చలకు ఆహ్వానించి గతంలో ఇచ్చిన హామీలు అమలు చేసి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. ముఖ్య అతిథిగా హాజరైన బాపూజీ మాట్లాడుతూ సచివాలయం రెవిన్యూ శాఖల మధ్య నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనివత్తిడి,మానసిక ఆందోళనలువలన వి ఆర్ ఓ లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరేతినట్లు వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు.వెంటనే ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యల పరిష్కరించకుంటే వేలాది మంది విఆర్ఓలతో చలో విజయవాడ పిలుపు ద్వారా సీసీఎల్ఏ కార్యాలయం ముట్టడి చెపడతామని హెచ్చరించారు.అప్పటికీ స్పందించకుంటే 15 వేల మంది విఆర్ఓలు రాష్ట్ర వ్యాప్తంగా మెరుపు సమ్మెకు కూడా వెనకాడబోమని బాపూజీ హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారులు ఒత్తిడి వలన రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.ఇటీవల కర్నూలు జిల్లా బేతంచర్ల మండలం పిండికర్ల గ్రామ విఆర్ఓ వెంకట్రామయ్య రోడ్ యాక్సిడెంట్లో మరణించగా, నెల్లూరు జిల్లాలో విఆర్ఓ నిర్భంధం, ఆపై దాడి, కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వీఆర్వో పరమేశ్వర రాజు తాహసిల్దార్ వేధింపులతో నిద్ర మాత్రలు తీసుకుని ప్రాణాపాయం స్థితి నుండి బయటపడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యంతో చికిత్స పొందుతున్న పరిస్థితి ఉందన్నారు. 2025 సంవత్సరంలో వందల వందలాది విఆర్వోలు ప్రాణాలు కోల్పోగా 2026లో జిఎస్‌డబ్ల్యూఎస్, విఆర్ఓలు అనేకమంది ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు.రెవెన్యూ జిఎస్‌డబ్ల్యూఎస్ రెండు శాఖల మధ్య నలిగి పోతున్నామని చెప్పారు. బయోమెట్రిక్ హాజరు క్లస్టర్ లలో ఫ్యామిలీ సర్వేల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు సారధ్యంలో మంత్రికి వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు.ఈ కార్యక్రమలో మండపేట మండల విఆర్ఓ అధ్యక్షులు మేక రామకృష్ణ, మండలం సెక్రటరీ గంటి రవి, నాయకులు జి.దుర్గారావు, బి.వెంకటమణ, గౌరీ, దుర్గా నాగలక్ష్మి, దేవి, సరిత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మండలంలోని విద్యార్థిని విద్యార్థులకు

# నులిపురుగు నివారణ మందులు అందజేత




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం ఎంపీపీ యూపీ పాఠశాల నందు నులి పురుగుల నివారణకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది, స్కూల్ హెడ్మాస్టర్, స్కూలు టీచర్స్ మరియు సీతానగరం మండల టిడిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుక్కాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి మల్టీ స్పోర్ట్స్ పోటీలు

## యువ క్రీడాకారులకు కలెక్టర్ మహేష్ కుమార్ పిలుపు



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

యువ క్రీడాకారులను సంవత్సరం పొడవునా ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించే శాప్ లీగ్--2026 మల్టీ స్పోర్ట్స్ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో శాప్ లీగ్ పేరిట నిర్వహించిన చదరంగం పోటీలను కలెక్టర్ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 12 నుంచి 20 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలురు, బాలికల కోసం ప్రత్యేకంగా ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మొత్తం 31 క్రీడా విభాగాల్లో పోటీలు జరుగనున్నాయని, ప్రతి జిల్లాలో సెలెక్షన్లు నిర్వహించి రాష్ట్ర స్థాయి టోర్నీలు నిర్వహిస్తామని చెప్పారు. విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులతో పాటు ప్రతిభను గుర్తించే టాలెంట్ స్కౌట్లు కూడా ఉంటారని వివరించారు. పోటీల్లో పాల్గొనదలచిన జిల్లా నివాసితులు ఆధార్ కార్డ్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. శాప్ వెబ్‌సైట్ లేదా యూట్యూబ్ లింకుల ద్వారా వివరాలు తెలుసుకొని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి (డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టిలో గ్లోబల్ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా శాప్ లీగ్--2026 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాప్ లీగ్--2026లో బాక్సింగ్, చదరంగం, సైక్లింగ్, వాటర్ స్పోర్ట్స్, అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బీచ్ వాలీబాల్, హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, బీచ్ హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బీచ్ ఫుట్‌బాల్, లాన్ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, ఆర్చరీ, జూడో, జిమ్నాస్టిక్స్, హాకీ, బీచ్ కబడ్డీ, రైఫిల్ షూటింగ్, బీచ్ సెపక్ టక్రా, అథ్లెటిక్స్ (మాస్టర్స్), షటిల్ బ్యాడ్మింటన్ (మాస్టర్స్), పారా స్పోర్ట్స్ (అథ్లెటిక్స్), పారా స్పోర్ట్స్ (స్విమ్మింగ్), పారా స్పోర్ట్స్ (రైఫిల్ షూటింగ్) వంటి క్రీడా విభాగాలు ఉన్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతిభ గల యువ క్రీడాకారులను గుర్తించి వారిలో నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రతి నెల మంగళవారం క్రీడా పోటీలను నిర్వహించేందుకు శాప్ లీగ్స్ స్పోర్ట్స్ క్యాలెండర్--2026ను విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత గల క్రీడా విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించబడతాయని చెప్పారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు శాప్ ఉత్తమ శిక్షకులచే ప్రత్యేక శిక్షణ అందించి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం శాప్ లీగ్స్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. చదరంగం అండర్-13, 15, 17, 19 విభాగాలు, సైక్లింగ్ అండర్-18 జూనియర్స్ వ్యక్తిగత సమయ ప్రయాణం, మాస్టర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24న జీఎంసీ బాలయోగి స్టేడియంలో సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. చదరంగం విభాగంలో విజేతలను ఫిబ్రవరి 21, 22 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు, సైక్లింగ్ విభాగంలో గెలుపొందిన క్రీడాకారులను ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. అన్ని పోటీలు స్పోర్ట్స్ ఫెడరేషన్ నిబంధనల ప్రకారం నిర్వహించబడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీవో వి.ఆర్. రుద్ర, కార్యదర్శి కె.ఈశ్వరరావు, ఉమెన్ కార్యదర్శి రమాదేవి, పీఈటీలు బీఎస్ఎన్ మూర్తి, టీవీ సురేష్, జిల్లా క్రీడా అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎన్‌హెచ్ 216ఈ అలైన్‌మెంట్‌పై

# కోనసీమలో ఉద్రిక్త వాతావరణం

## సారవంతమైన భూములు, జనవాసాలకు ముప్పు,రైతుల్లో ఆందోళన తీవ్రం
## ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు టీడీపీ నేతల వినతి

విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

కోనసీమ జిల్లాలో ప్రతిపాదిత జాతీయ రహదారి ఎన్‌హెచ్ 216ఈ (అమలాపురం రావులపాలెం) అలైన్‌మెంట్‌పై ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే వ్యవసాయాధారిత ప్రాంతంగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో రహదారి నిర్మాణం పేరుతో సారవంతమైన సాగుభూములు, పచ్చని కొబ్బరి తోటలు, జనవాసాలు నష్టపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రతిపాదిత మార్గం అమలైతే వందలాది ఎకరాల పంటభూములు కోల్పోయే పరిస్థితి నెలకొంటుందని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇందుపల్లి, పరిసర గ్రామాల్లో అనేక ఇళ్లు తొలగింపునకు గురయ్యే అవకాశం ఉందని, దశాబ్దాలుగా జీవనాధారంగా ఉన్న భూములు ఒక్కసారిగా కోల్పోవాల్సి వస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి తోటలు, చిన్నచిన్న వ్యవసాయ క్షేత్రాలు, చెరువులు, కాలువలు దెబ్బతింటే స్థానిక ఆర్థిక వ్యవస్థకే పెద్ద దెబ్బ తగులుతుందని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ తదితరులు అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మాధుర్ ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం



సమర్పించారు. ప్రస్తుత అలైన్‌మెంట్ వల్ల ప్రజలకు కలిగే నష్టాలను వివరించి, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. రహదారి నిర్మాణం అభివృద్ధి పేరుతో చేపట్టినా, అది ప్రజల జీవనాధారాలను నాశనం చేసే విధంగా ఉండకూడదని నేతలు స్పష్టం చేశారు. ఒకవేళ రహదారి నిర్మాణం తప్పనిసరి అయితే, రైతులకు, నిరుపేదలకు మార్కెట్ విలువకు మించి గరిష్ట స్థాయిలో నష్టపరిహారం అందించాలనీ, పునరావాసం పట్ల స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలనీ డిమాండ్ చేశారు. అదేవిధంగా, వీలైనంత వరకు జనవాసాలకు దూరంగా ఖాళీ ప్రభుత్వ భూముల గుండా అలైన్‌మెంట్ మార్పు చేయాలని సూచించారు. ఈ అంశంపై స్పందించిన ఎంపీ గంటి హరీష్ మాధుర్ ప్రజల ఆందోళనలను ఇప్పటికే గమనిస్తున్నామని తెలిపారు. సమస్య తీవ్రతను కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇకపోతే, స్థానిక రైతు సంఘాలు, గ్రామస్థులు కూడా త్వరలో సమావేశాలు నిర్వహించి తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ, ప్రజల జీవనోపాధి, పచ్చని కోనసీమ సౌందర్యం కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### కోనసీమ కుకింగ్ & కేటరింగ్ అసోసియేషన్

# మూడవ సర్వసభ్య సమావేశం

## నూతన అధ్యక్షుడిగా సలాది సూర్యప్రకాశరావు (సూరిబాబు) ఏకగ్రీవ ఎన్నిక



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కేటరింగ్ వృత్తిదారుల ఐక్యత, అభివృద్ధి, సంక్షేమం లక్ష్యాలుగా పనిచేస్తున్న కోనసీమ కుకింగ్ & కేటరింగ్ అసోసియేషన్ మూడవ సర్వసభ్య సమావేశం అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ సమావేశం కేవలం ఒక సాధారణ సమావేశంగా కాకుండా, కోనసీమ కేటరింగ్ రంగానికి భవిష్యత్ దిశానిర్దేశం చేసిన కీలక వేదికగా నిలిచింది. జిల్లా నలుమూలల నుండి మాత్రమే కాకుండా, పొరుగు జిల్లాల నుండి కూడా వందలాది మంది కేటరింగ్ వృత్తిదారులు, ప్రముఖులు, ఆహ్వానితులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వృత్తిపరమైన ఐక్యత, పరస్పర గౌరవం, అభివృద్ధి పట్ల నిబద్ధత స్పష్టంగా కనిపించింది. సమావేశ ప్రాంగణం ఆత్మీయతతో నిండిపోయి, సభ్యుల ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం ప్రారంభంలో సంఘం గత కార్యకలాపాలపై సమగ్ర నివేదికను సమర్పించారు. గత సమావేశం నుండి ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు మరియు భవిష్యత్ లక్ష్యాలపై సభ్యులకు వివరించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. సభ్యుల ఏకగ్రీవ నిర్ణయంతో అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సలాది సూర్యప్రకాశరావు (సూరిబాబు) ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా గుడివాడ రామారావు, బోనం కృష్ణలను ఎన్నుకున్నారు. సెక్రటరీగా రావూరి సత్యకిరణ్, కోశాధికారిగా వేమా నరసింహారావు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వ్యవస్థాపక సభ్యులు యలమంచిలి బాలగంగాధర తిలక్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గ సభ్యులు సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, వృత్తి పురోగతికి కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రధానంగా కేటరింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారుల అభిరుచులు మారుతున్న నేపథ్యంలో నాణ్యత, రుచి, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సభ్యులు స్పష్టం చేశారు. కస్టమర్ నమ్మకాన్ని కాపాడుకోవడం, సేవల్లో నూతనతను తీసుకురావడం అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కేటరింగ్ రంగంలో కొత్త పరికరాలు, నిర్వహణ పద్ధతులు, సర్వీస్ విధానాలను సభ్యులకు పరిచయం చేయాలని తీర్మానించారు. వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వృత్తిలోకి కొత్తగా ప్రవేశిస్తున్న యువతకు సరైన మార్గదర్శకత్వం అవసరమని సభ్యులు అభిప్రాయపడ్డారు. వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా, సామాజికంగా బలపడేలా చేయాలని ప్రతిపాదించారు. అనుభవజ్ఞులైన సీనియర్ సభ్యులు యువతకు మెంటర్లుగా వ్యవహరించాలని సూచించారు. సభ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో వృత్తిదారులను ఆదుకునే విధంగా సహాయక చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఆర్థిక ఇబ్బందులు వంటి పరిస్థితుల్లో సంఘం అండగా నిలవాలని తీర్మానించారు. పరస్పర సహకారంతోనే సంఘం బలోపేతం సాధ్యమని పలువురు సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటరింగ్ రంగంలో అపార అనుభవం గడించి, అనేకమందికి వృత్తి మెలకువలు నేర్పిన కురువృద్ధులు గంగవరపు మల్లిఖార్జున్‌ను ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను సభ కొనియాడింది. ఆయన అనుభవం, కృషి, మార్గదర్శకత్వం యువతకు ఆదర్శమని సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ సౌత్ జోన్ చైర్మన్ పమిడిపాటి చంద్రశేఖర్, ప్రకాశం జిల్లా సెక్రటరీ మైలాపురం సుబ్రహ్మణ్యం, పల్నాడు గౌరవ అధ్యక్షులు గంజి పోలయ్య, చిలకలూరిపేట పట్టణ అధ్యక్షులు కిరణ్ తదితరులు హాజరై తమ సూచనలు అందించారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, ఐక్యతతో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షుడు సలాది సూర్యప్రకాశరావు మాట్లాడుతూ సభ్యుల విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, ప్రతి సభ్యుడి అభిప్రాయాన్ని గౌరవించి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతానని తెలిపారు. కేటరింగ్ రంగాన్ని నాణ్యతలో, సేవల్లో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశం విజయవంతంగా నిర్వహించడంలో పూర్తి సహాయ సహకారాలు అందించిన శ్రీ గణేష్ కిరాణా (కుప్పాల బ్రదర్స్), అధికారి వెంకటేశ్వరరావులను అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. వారి సహకారం కార్యక్రమం విజయానికి ప్రధాన కారణమని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. సమావేశం ముగింపులో సభ్యులందరూ ఐక్యతను మరింత బలపరచాలని, నూతన కార్యవర్గానికి సంపూర్ణ సహకారం అందించాలని సంకల్పించారు. కోనసీమ కేటరింగ్ వృత్తిదారుల మధ్య ఐక్యత మరింత బలపడిందని, నూతన అధ్యక్షుని సారథ్యంలో అసోసియేషన్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తంగా ఈ సర్వసభ్య సమావేశం కోనసీమ కేటరింగ్ రంగానికి కొత్త దిశను నిర్దేశించిన చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ఐక్యత, నాణ్యత, నూతనత అనే మూల సూత్రాలతో అసోసియేషన్ భవిష్యత్తులో మరింత ప్రగతి సాధించబోతోందనే నమ్మకం ప్రతి సభ్యుడి ముఖంలో స్పష్టంగా కనిపించింది.

# ఎముకల సమస్యతో బాధపడుతున్న బాలునికి యుటిఎఫ్ సాయం



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలంలోని పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన విద్యార్థి యర్రా అఖిలేష్ ఎముకల సమస్యతో బాధపడుతున్నాడు. వైద్య సహాయం నిమిత్తం అంబాజీపేట మండలంలోని యుటిఎఫ్ ఉపాధ్యాయులు విరాళాలుగా అందించిన 25 వేలు రూపాయలను మంగళవారం వారి ఇంటి వద్ద వారికి విరాళంగా ఇచ్చారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామం కడలి వారి పాలెం పాఠశాలలో పనిచేస్తున్న పి.నారాయణమూర్తి వారి కుటుంబ సభ్యులు వ్యక్తిగతంగా అందించిన 18,100 మొత్తం రూ.43,100 బాలుని తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జీవీ రమణ ఉమ్మడి జిల్లా పూర్వపు ప్రధాన కార్యదర్శి టీ.కామేశ్వరరావు, ఎఫ్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ పి.నారాయణమూర్తి, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.సూర్యనారాయణ, పి.విశ్వప్రసాద్ నక్క సుధాకర్ బాబు, పి.శ్రీనివాస్, బి.సత్యనారాయణ, పి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# కాట్రేనికోన డిసిసి బ్యాంకు వద్ద సహకార ఉద్యోగుల ఆందోళన



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలంలోని ఏడు సహకార సంఘాల ఉద్యోగులు మంగళవారం కాట్రేనికోన డిసిసిబి వద్ద ఆందోళన చేపట్టారు. మానవహారం నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రభుత్వం స్పందించాలని ఈ సందర్భంగా సహకార సంఘ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు యర్రం శెట్టి రామచంద్రరావు, గుత్తుల శ్రీనివాస్, అప్పారి ప్రేమేశ్వరరావు, కోటిపల్లి ప్రసాద్, వి.శంకర్, సీతారామారావు, వై.గంగాధరం, నాగిడి లక్ష్మణ్ తదితరులుఈ ఆందోళనలో పాల్గొన్నారు.

# ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో డీపీఎస్ విద్యా కుసుమం

### 44 సెకన్లలో 7 సాంప్రదాయ హిందూ శ్లోకాలు పఠనం - చిన్నారి ముమ్మిడివరపు ఆరా శ్రీ దత్తకు అభినందనలు



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు అతి చిన్న వయస్సులోనే మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ తనదైన శైలిలో సాంప్రదాయ హిందూ శ్లోకాలను అవలీలగా పఠించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది అమలాపురం డీపీఎస్ విద్యా కుసుమం ముమ్మిడివరపు ఆరా శ్రీ దత్త. అమలాపురం రూరల్ మండలం కామనగరువులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నర్సరీ చదువుతున్న ఆరా శ్రీ దత్త తన అద్భుతమైన జ్ఞాపకశక్తి, పఠన నైపుణ్యాలకు గాను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా గుర్తింపు పొందింది. నాలుగు సంవత్సరాలు ఆరు నెలల వయస్సులో ఎటువంటి అంతరాయం లేకుండా ఒక్క ప్రయత్నంలోనే 7 సాంప్రదాయ హిందూ శ్లోకాలను విజయవంతంగా పఠించింది. కేవలం 44 సెకన్లలో స్పష్టమైన ఉచ్చారణతో, ఆత్మవిశ్వాసంతో ఈ పఠనాన్ని పూర్తి చేసింది. ఈ అద్భుత విజయంతో ఆమె అసాధారణ జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, భక్తి భావం స్పష్టమవుతున్నాయి. ఈ విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 'అచీవర్' బిరుదును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఆర్డీవో కె. మాధవి అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే డీపీఎస్ పాఠశాల చైర్మన్ నంద్యాల నాయుడు, పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ మనువిహార్ చిన్నారిని అభినందించారు.

# మోడేకుర్రు అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన చిర్ల జగ్గిరెడ్డి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం, కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో లేళ్ల రామకృష్ణ, మోకా నాగలక్ష్మి, యాళ్ల నాగు, యాళ్ల రాంబాబు ఇళ్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ దుర్ఘటనలో బాధిత కుటుంబాలు ఆస్తి నష్టంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ ఘటన విషయం తెలుసుకున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఈ రోజు మోడేకుర్రు గ్రామానికి చేరుకుని అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ప్రత్యక్షంగా కలిసి పరామర్శించారు. పరామర్శించి రెండు కుటుంబాలకు 50 కేజీల బియ్యం, చీరలు , 10 వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన బాధితులను ధైర్యపరుస్తూ, ఇలాంటి విషాదకర సంఘటన జరగడం ఎంతో బాధాకరమని అన్నారు. అగ్ని ప్రమాదంలో ఇల్లు, వస్తువులు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటుందని, ఇలాంటి కష్టకాలంలో బాధితులకు పార్టీ పూర్తిగా అండగా నిలుస్తుందని చిర్ల జగ్గిరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీకి కూటమికి మధ్య వ్యత్యాసం ప్రజలు గమనిస్తున్నారు : పాలూరి సత్యానందం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు కళ్ళారా చూస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు పొర్లు దండాలు పెట్టీ మరీ అడిగినా రోడ్లు నిర్మించలేదని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లకు మహర్దశ పట్టిందని పాలూరి పేర్కొన్నారు. పల్లె రోడ్లకు పండగొచ్చిందన్నారు. గుంతలకు రోడ్లకు చెక్ పెట్టారని పేర్కొన్నారు. వేలకోట్లతో రోడ్ల పునర్నిర్మాణం చేపట్టారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల మరమ్మత్తులకు గుప్పెడుమట్టి పోయకపోవడంతో గ్రామీణ, పట్టణ రహదారులన్నీ ఛిద్రమయ్యాయనీ వాపోయారు. గతంలో గుంతల రోడ్లపై నిత్య ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకున్నా నాధుడే కరువయ్యాడని ఆరోపించారు. కూటమి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల అభివృద్ధి పై దృష్టి సారించిందని తాజా గా బడ్జెట్‌లో 3,237 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.పట్టణ, పల్లెల్లో గుంతల లేని రోడ్లపై ప్రజలు ప్రయాణం చేస్తారని తెలిపారు. ఏపి రాష్ట్ర వ్యాప్తంగా గుంతల రహితంగా మార్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పాలూరి కృతజ్ఞతలు తెలిపారు.



# పాత్రికేయులూ ప్రత్తిపాడు అభివృద్ధికి సహకరించండి..!

- వైకాపా ఇంఛార్జి ముద్రగడ గిరిబాబు విజ్ఞప్తి
- 15 నెలలకు గుర్తొచ్చిన పాత్రికేయులు
- కిర్లంపూడిలో పాత్రికేయులతో ముద్రగడ మిలాకాత్
- తొలి సారిగా అల్పాహారం విందు ఏర్పాటు
- స్వయంగా నాస్తా అందించిన సీనియర్ ముద్రగడ
- నియోజకవర్గం వైకాపా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు
- "పిలవని వార్తల"ను రాయమన్న విలేఖరి అపురూప్
- ముఖ్య ప్రజా కార్యక్రమాలకు నేరుగా ఆహ్వానిస్తాం
- జూనియర్ ముద్రగడ ఒప్పుకోలు



**కిర్లంపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇంఛార్జిగా సోమవారం 02 డిసెంబర్ 2024 న నియమితులైన ముద్రగడ గిరిబాబుకు సరిగ్గా 15 నెలల కాలం పూర్తవుతుండగా ఇప్పటికి నియోజకవర్గం పాత్రికేయులు గుర్తుకు రావడం, వారితో మిలాకాత్ కావడం అరుదైన విశేషమే. పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని జగ్గంపేట శాసన నియోజకవర్గంలోని మండల కేంద్రం కిర్లంపూడికి చెందిన మాజీ మంత్రి, ఒకప్పటి కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ద్వితీయ కుమారుడుగా, ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా ముద్రగడ గిరిబాబు సుపరిచితులు. ముద్రగడ పద్మనాభం 2024 నాటికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నేత కావడం, ఈ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి వరుపుల సుబ్బారావు ఎమ్మెల్యేగా పరాజయం పాలవ్వడం, వృద్ధాప్యం పైబడి ఆరోగ్య సమస్యలు తలెత్తిన నేపథ్యంలో ఈ పార్టీలో సుబ్బారావు క్రియాశీలక రాజకీయాలకు దాదాపు పూర్తిగా దూరం కావడం, నియోజకవర్గం పార్టీ పరిస్థితి నావికుడు లేని నావ సామెతను తలపించడం, పార్టీలో నాయకత్వ శూన్యాన్ని అత్యవసరంగా పూరించాల్సి రావడం వంటి కొన్ని ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో ఏమాత్రం రాజకీయ పూర్వ అనుభవంలేని ముద్రగడ గిరిబాబుని రాత్రికి రాత్రే నియోజకవర్గ పార్టీ ఇంచార్జి పదవి వరించింది. ఐతే నాటి నుంచి కూడా ఈ 15 నెలల కాలంలో జూనియర్ ముద్రగడ నియోజకవర్గం పాత్రికేయులతో ఎందుకనో గానీ సాన్నిహిత్యంగా మెలగ లేకపోతూ వచ్చారు. అయితే ఏ విభేదాలూ మాత్రం లేవు. విలేకరులను ఆహ్వానించకుండానే ఆయన పార్టీ కార్యక్రమాలను చేసుకుపోడం, పార్టీ శ్రేణులు, ప్రజలతో మమేకం అవుతూ వస్తున్నారు. అంతే తప్ప నియోజక వర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, అన్నవరం, రౌతులపూడి ప్రాంతాల పాత్రికేయులతో గిరిబాబుకు ముఖ పరిచయం, సత్సంబంధాలూ లేవు. పాత్రికేయులు మాత్రం మనసులో ఏ వ్యతిరేక భావన పెట్టుకోకుండా యధాశక్తి ఆయన వార్తలను రాస్తూ వారి విధి ధర్మాన్ని నెరవేరుస్తూ ఉన్నారు. జూనియర్ ముద్రగడ ఎప్పుడు తమతో మిలాకాత్ అవుతారని ఎదురు చూస్తూ వస్తూన్నారు. ఇక ఆ మిలాకాత్ సమయం రానే వచ్చింది. రెండు రోజుల ముందస్తు ఆహ్వానం మేరకు ఈ మంగళవారం ఉదయం శంఖవరం పాత్రికేయులు కిర్లంపూడి వెళ్ళి ముద్రగడ ద్వయం నేతలను కలవడంతోను, అంతకు ముందు రోజులు నియోజకవర్గపు మిగతా నాలుగు ప్రాంతాల పాత్రికేయులూ గిరిబాబును కలవడంతో నియోజకవర్గం పాత్రికేయులను గిరిబాబు కలిసే సమావేశాలు దిగ్విజయం అయ్యాయి. సీనియర్ ముద్రగడ తన ఇంటి ప్రాంగణంలో పాత్రికేయులకు సాదర స్వాగతం పలకడమే గాక తన పెద్దరికాన్ని కాసేపు పక్కన పెట్టి భోజనపు బల్ల వద్ద పాత్రికేయులు ప్రతి ఒక్కరికీ తానే తన స్వహస్తాలతో ఉపాహారాల (నాస్తా)ను అందించి తన సహృదయతను ప్రదర్శించారు. అనంతరం జూనియర్ ముద్రగడ శంఖవరం పాత్రికేయులు ఎదుట తన అంతరంగాన్ని బహిర్గతం చేసారు. నియోజకవర్గం అభివృద్ధికి తమ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల విషయాలను ప్రభుత్వం, ప్రజల వద్దకు సక్రమంగా చేర్చాలని, అందుకు సంపూర్ణ సహకారం అందించాలని అభ్యర్థించారు. ఏ మండలానికి ఆ మండలానికే పార్టీ వాట్సాప్ గ్రూపులను సృష్టించడానికి బదులుగా నియోజకవర్గం మొత్తానికి ఒకే ఒక గ్రూప్ ను ఏర్పాటు చేస్తామని, అందులో నాలుగు మండలాల విలేకరులను చేరుస్తామని ఆయన తన నిశ్చితాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విలేకరుల సలహాలు, సూచనలనూ కోరారు. అందుకు ది శంఖవరం ప్రెస్ క్లబ్ కార్యదర్శి గుణపర్తి అపురూప్ ప్రతిస్పందిస్తూ... వాట్సాప్ లో పెట్టిన, ఆహ్వానించని కార్యక్రమాల సమాచారాలను వార్తలుగా రాయకూడదని ది శంఖవరం ప్రెస్ క్లబ్ తీర్మానించుకుందని నిర్మొహమాటంగా కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. దీంతో గిరిబాబు బదులిస్తూ చిన్న చిన్న విషయాలతో పాటు అన్ని విషయాలనూ వాట్సాప్ ద్వారా మీ అందరికీ చేరవేస్తామని, ముఖ్య కార్యక్రమాలకు మాత్రం ముందుగా ఆహ్వానిస్తామని ముద్రగడ గిరిబాబు బదులు ఇచ్చారు. మొత్తం మీద గిరిబాబుకు, నియోజకవర్గం పాత్రికేయులకూ మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడింది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందాలు ఏవో సఫలమైనంత అవ్యక్త సంతోషం ఇరు పక్షాల్లోనూ కనిపించింది.

# కూటమి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం కన్నా ప్రచారం మిన్న...!

**మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్**



**కిర్లంపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 20 మాసాలు గడుస్తున్నప్పటికీ పబ్లిసిటీకి ఇచ్చే ప్రాధాన్యతను ప్రజా సంక్షేమానికి ఇవ్వడం లేదని మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ విమర్శించారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైసిపి పిఏసి సభ్యుడు ముద్రగడ పద్మనాభంను, ప్రత్తిపాడు వైసిపి ఇన్ఛార్జ్ ముద్రగడ గిరిబాబును మర్యాద పూర్వకంగా అమరనాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కలిసారు. ఈ సందర్భంగా అమరనాథ్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం కోసం ప్రజలకు అలవి కాని హామీలిచ్చి, ప్రజలను మోసగించింది అన్నారు. రాష్ట్ర బడ్జెట్ లో ప్రజా సంక్షేమానికి కేటాయింపులు లేకుండా చేసారని, ఇప్పటికే కూటమి ప్రభుత్వం రెండున్నర లక్షల కోట్లను అప్పులు తెచ్చిందని, కాని ప్రజలు, పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి 5వేల కోట్లు బకాయిలు పెట్టి, పేదల వైద్యాన్ని భారం చేసిందని, విద్యలో ఫీజు రియెంబర్స్మెంట్ కు 6వేల కోట్లు బకాయి పెట్టిందని, వ్యవసాయానికి ఏ విధమైన కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. తెచ్చిన అప్పుతో వ్యవసాయం లేదు, విద్య లేదు, వైద్యం లేదు వీటిని దేనికి కేటాయిస్తుందని, ఆ నిధులను ప్రభుత్వం ఏమి చేస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి వైసిపి నేతలపైన, కార్యకర్తలపైన దాడులు చేసి, వారిపైనే కేసులు పెడుతుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై టిడిపి వారే దాడులు చేసి, ఇంటిని తగులబెట్టి, మరలా అంబటిపైనే కేసు పెట్టడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిపక్షం గొంతు ఎంత నొక్కితే అంతకు రెండింతలు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజల పక్షాన్న ప్రశ్నిస్తుందన్నారు.

# శ్రీలంక సర్కారు కీలక నిర్ణయం.. ఎంపీల పెన్షన్లు రద్దు



**కొలంబో, విశ్వం వాయిస్ న్యూస్ :** పొరుగు దేశం శ్రీలంక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపీల పెన్షన్లను పూర్తిగా రద్దు చేసింది. దీనికి సంబంధించిన బిల్లు పార్లమెంట్‌లో మంగళవారం ఆమోదం పొందింది. 225 మంది సభ్యులు కలిగిన సభలో 154 మంది ఈ బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. కేవలం ఇద్దరు మాత్రమే వ్యతిరేకించారు. మిగిలిన సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. శ్రీలంకలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన పార్లమెంట్ సభ్యులకు ప్రస్తుతం పెన్షన్ అందుతోంది. కొత్త చట్టం ఆమోదం పొందడంతో ఇప్పటికే అందుకుంటున్న వారితో పాటు, కొత్తగా అర్హత సాధించిన వారికీ పెన్షన్లు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే మాజీ అధ్యక్షులకు ఇచ్చే ప్రయోజనాలను దిసనాయకే ప్రభుత్వం నిలిపివేసింది. ఇంటి అద్దె, అలవెన్సులు, పెన్షన్లు, రవాణా సౌకర్యాలను గతేడాది సెప్టెంబర్‌లో రద్దు చేసింది. పర్యాటకంపై ఆధారపడిన దేశమైన శ్రీలంకకు కరోనా, ఉగ్రవాద దాడుల కారణంగా విదేశీయుల రాక తగ్గింది. నాటి పాలకుల ఆర్థిక నిర్వహణ లోపం కారణంగా పరిస్థితి మరింత తీవ్రమైంది. 2022లో దివాళా తీసింది. దీంతో నాటి పాలకులపై ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేశంలో ఆహారం, ఔషధాలు, విద్యుత్, చమురుకు తీవ్ర సంక్షోభం ఏర్పడింది. ప్రజల నుంచి ఆందోళనలు చెలరేగడంతో నాటి అధ్యక్షుడు గొటబాయ రాజపక్స తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో మార్క్సిస్టు నేత దిసనాయకే విజయం సాధించి అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడంలో భాగంగా ఎన్నికల వాగ్దానంలో ఒకటైన పెన్షన్ల రద్దుకు బిల్లు తీసుకొచ్చారు. దేశం క్లిష్టపరిస్థితులు ఎదుర్కొంటున్న వేళ చట్టసభ సభ్యులకు పెన్షన్లు పొందే నైతికత లేదంటూ ఈ బిల్లుపై చర్చ సందర్భంగా న్యాయ శాఖ మంత్రి హర్షణ నానాయక్కర పేర్కొన్నారు.


# ఐబొమ్మ రవికి బెయిల్.. దేశం విడిచివెళ్లొద్దని హైకోర్టు ఆదేశాలు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సినిమా పైరసీ కేసులో 'ఐబొమ్మ' రవికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇమంది రవి ఎట్టి పరిస్థితుల్లోనూ దేశం విడిచి వెళ్లొద్దని, తన పాస్‌పోర్టును కోర్టులో సరెండర్ చేయాలని ఆదేశించింది. ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు సీసీఎస్ పోలీసుల ఎదుట హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ కేసులో గతేడాది నవంబరులో అతడు అరెస్టయిన విషయం తెలిసిందే.

### ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా

# పొనుగుపాటి శ్రీనివాస్ నియామకం



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

భారతీయ జనతా పార్టీ డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన పొనుగుపాటి శ్రీనివాస్‌ను శుక్రవారం అమలాపురంలో ఘనంగా సత్కరించారు. అమలాపురంలోని రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ స్వగృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, సీనియర్ నాయకుడు అరిగెల నాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పొనుగుపాటి శ్రీనివాస్ గతంలో కూడా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ జిల్లా నలుమూలలా విస్తృతంగా పర్యటించారని గుర్తుచేశారు. ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో పలు సామాజిక, సేవా, అవగాహన కార్యక్రమాలు చేపట్టి పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. క్రమశిక్షణ, నిబద్ధత, పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావం కలిగిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు సాధించారని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్సీ మోర్చాను మరింత చైతన్యవంతం చేయడంతో పాటు గ్రామ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను విస్తరింపజేసే దిశగా శ్రీనివాస్ సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధి, సామాజిక న్యాయం, బలహీన వర్గాల సాధికారత కోసం మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ పథకాల ప్రచారానికి మరియు ఎస్సీ మోర్చా విస్తరణకు మరింత కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ అభినందనలు తెలిపారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# 1136వ రోజు అభాగ్యులకు అన్నదానం



**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం తాళ్లరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలోమంగళవారం లయన్ కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ అన్నదాన కార్యక్రమం ద్వారా అభాగ్యులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ అన్నదానం కార్యక్రమం ప్రారంభించి 1136 రోజులు అవుతుందని, ఈ అన్నదానం కార్యక్రమం ప్రతిరోజు నిరంతరం కొనసాగిస్తున్నామని, ఎందరో దాతల సహకారంతో మరియు లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో కార్యక్రమం ద్వారా ఎంతో మంది అభాగ్యులకు ఆహారం అందిస్తున్నామని అన్నారు. లయన్స్ క్లబ్ సేవలను పలువురు అభినందించారు. అన్నదాన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు దాతలు పాల్గొన్నారు.

# తాళ్లరేవు అభివృద్ధి నా ధ్యేయం

### ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలంలో 18 కోట్ల రూపాయలతో 17 గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాట్ల సుబ్బరాజు తెలిపారు. చొల్లంగి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 25 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డుల నిర్మాణం కార్యక్రమానికి శంకుస్థాపనలు చేశారు. పటవల 216 జాతీయ రహదారి వద్ద నుండి మంజేరు వరకు ఆర్ అండ్ బి రహదారి నిర్మాణానికి కోటి 60 లక్షలతో నిర్మిస్తున్న రహదారికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు తహశీల్దార్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతి జేఏసి రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు నల్ల బ్యాడ్జీలను ధరించి మంగళవారం నిరసన దీక్షలు చేపట్టారు. మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఈపి రాజేష్, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, కార్యదర్శి వేమగిరి గుర్రాజు, కోశాధికారి పద్మినిల ఆధ్వర్యంలో వీఆర్వోలు, విఆర్ఏలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి తమ సమస్యలను వెంటనే పరిష్కారించాలని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఈపి రాజేష్ మాట్లాడారు. వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్ల పని భారాన్ని తగ్గించాలి, వీఆర్వోలకు రెవెన్యూ విధులు మాత్రమే అప్పగించాలి, విధులకు మేం వ్యతిరేకం కాదు, మాకు పని నిర్దేశించేది ఒక్కరే అయి ఉండాలి, వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లకు డిడిఓగా స్థానిక ఎమ్మార్వోని నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంతో మంది మా ఉద్యోగులు మండల ఉన్నతాధికారుల పని భారంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పని భారంతో బలై పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేం ఉన్నత అధికారుల ఆదేశాలు, సూచనలను తప్పక పాటిస్తాం. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించ గలం. మా న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే మాత్రం మార్చి ఒకటవ తేదీ నుండి మా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అమరావతి జాయింట్ కమిటీ పిలుపు మేరకు మూడు రోజుల పాటు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఈపి రాజేష్, ప్రకటించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాహసిల్దార్ కార్యాలయంలో సమర్పించారు.

### క్రీడా స్ఫూర్తిని

# ప్రతి క్రీడాకారుడు అలవర్చుకోవాలి

## రంజాన్ కప్ విజేతలకు ట్రోఫీ అందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రీడా స్ఫూర్తి... పోరాట పటిమను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హితవు పలికారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని అల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహ్మద్ అబ్దుల్లా ప్రతి ఏటా నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ను ఈ ఏడాది కూడా జాంపేటలోని రిజర్వ్ పోలీసు మైదానంలో రంజాన్ క్రికెట్ టోర్నమెంట్ 2026 పేరిట నిర్వహించారు. సుమారు 10 రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్ ఫైనల్స్ సోమవారంతో ముగియగా అందులోని విజేతలకు నెహ్రూనగర్లోని బిలాల్ షాదీ ఖానాలో ఈరోజు ఉదయం ట్రోఫీలు, నగదు బహుమతులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహ్మద్ అబ్దుల్లా కలిసి అందచేశారు. విన్నర్గా నిలిచిన ఏబీసీ 360 జట్టుకు రూ. 25,000 నగదు ట్రోఫీ, రన్నర్గా నిలిచిన కొంతమూరు ఫ్రెండ్స్ 11 జట్టుకు రూ. 15,000 నగదు ట్రోఫీ, మూడవ స్థానంలో నిలిచిన ఎంసీసీ సీనియర్ జట్టుకు రూ. 5,000 నగదు ట్రోఫీని అందచేశారు. అలాగే బెస్ట్ బ్యాట్స్ మెన్ రఫీ, బెస్ట్ బౌలర్ మౌలానా, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ మౌలానాలకు ట్రోఫీలను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని యువకులను ఉత్సాహ పరిచేందుకు అబ్దుల్లా తన సొంత ఖర్చులతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్లో ఓడిపోయిన వారు బాధపడాల్సిన అవసరం లేదని, పోరాడితే విజయం తప్పకుండా వస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తాము గత ఐదేళ్లూ ఎన్నో ఇబ్బందులు... బాధలు ఎదుర్కొంటూ నిలదొక్కుకుని విజయం సాధించామన్నారు. ముస్లిం మైనారిటీలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని, వారి ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. అల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మహ్మద్ అబ్దుల్లా మాట్లాడుతూ ఆ అల్లా దయ అందరిపై ఉంటుందన్నారు. ప్రతి ఏడాది రంజాన్ను పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేయడం తమ కుటుంబం ఆనవాయితీగా పెట్టుకుందన్నారు. అయితే యువత కోసం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి వారిని ఉత్సాహ పరిచడం జరుగుతోందన్నారు. కాగా మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విశేషంగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వెల్లడించారు. మసీదులు, షాదీ ఖానాల అభివృద్ధికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వారి భవానీ చారిటబుల్ ట్రస్టు తరపున ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవ చేసేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. క్రికెట్ టోర్నమెంట్ను అద్భుతంగా నిర్వహించిన దానవాయిపేట ఆర్గనైజర్స్ గౌస్, చిస్టి, ఇమ్రాన్, ఆజామ్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవనీ కుమార్, ఛాంబర్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు, నాయకులు ఛాన్ బాషా, జక్కంపూడి అర్జున్, రఫిక్ రాజా, షేక్ బషీర్, యండి ఖాన్ భాయ్, మహబూబ్ జానీ, అస్లాం, అహ్మదున్నీషా, అమీర్ రాజా,ఈతలపాటి రవి, రబ్బాని, అధిక సంఖ్యలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అవసరమైన పనులే చేస్తున్నాం

## 34వ వార్డులో రూ.2 కోట్ల 80 లక్షల పనులు.. : ఎమ్మెల్యే వాసు శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు అవసరమైన పనులే చేస్తున్నాం, అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన పనులను ప్రాధ్యానత ఇస్తున్నాం అని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఎక్కడా అనవసరమైన చేయడం లేదని, నిధులను దుర్వినియోగం చేయడం లేదని ఆయన స్పష్టం చేసారు. స్థానిక 34వ వార్డులో అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు ఈ వార్డులో రూ. 32 లక్షల 25వేల రూపాయల విలువైన పనులు పూర్తిచేశామ న్నారు. ఇపుడు రూ. 14 లక్షల 70వేల రూపాయల విలువైన పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇదికాక 2 కోట్ల 26 లక్షల రూపాయల పనులు టెండర్ దశలో ఉన్నాయని ఎమ్మెల్యే వాసు తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక మొత్తం 2 కోట్ల 80లక్షల రూపాయల విలు వైన పనులు చేసుకుంటున్నామని వివరించారు. రోడ్లు, డ్రైన్లు, పార్కులు వంటివి ప్రాధాన్యత క్రమంలో సిటీ నియోజక వర్గంలో చేసుకుంటూ వెళ్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఆది వారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నగర ప్రజలు సహకరించి విజయవంతం చేసారని ఎమ్మెల్యే వాసు పేర్కొంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గోదావరి గట్టు వెంబడి ఉన్న వార్డులతో పాటు 34వార్డులో కూడా భక్తులకు ప్రసాద పంపిణీ వంటి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టారని ఆయన అభినందించారు. మంచి మనసుతో నగర ప్రజలు మహాశివ రాత్రికి అందించిన సహకారం పుష్కరాలకు కూడా అందించాలని ఆయన కోరారు. డివిజన్ ఇంచార్జ్ కేలం శ్రీను పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్ పార్క్‌కు పునర్జీవం

## బీజేపీ నాయకుడు అడపా వరప్రసాద్ చొరవతో..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎనిమిదేళ్లుగా నిర్జీవంగా మారిన పార్క్‌కు పునర్జీవం..బీజేపీ నాయకుడు అడపా వరప్రసాద్ చొరవతో శుభ్రపరిచే చర్యలు రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని ఆవ రోడ్డులో 16వ వార్డు వాంబే అపార్ట్మెంట్స్ సమీపంలో ఉన్న 100 అడుగుల రోడ్డుకు ఆనుకుని ఉన్న పార్క్ గత ఎనిమిదేళ్లుగా నిర్జీవంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. ఒకప్పుడు పిల్లలు ఆడుకునే స్థలంగా, వృద్ధులు విశ్రాంతి తీసుకునే ప్రదేశంగా ఉన్న ఈ పార్క్ క్రమంగా నిర్లక్ష్యానికి గురై డంపింగ్ యార్డుగా మారిపోయింది. గంజాయి బ్యాచ్‌లు, మందుబాబుల అడ్డాగా మారడంతో చుట్టుపక్కల నివసించే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పార్క్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు ఈ దుస్థితిపై పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ పరిష్కారం కనిపించలేదు.ఈ నేపథ్యంలో బీజేపీ నాయకుడు అడపా వరప్రసాద్ చొరవ తీసుకుని నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. పార్క్ పరిస్థితిని వివరించి, వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన కమిషనర్ వెంటనే జెసిబి యంత్రాన్ని పంపించి పార్క్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు పార్క్ శుభ్రపరిచే పనులను ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా అడపా వరప్రసాద్ మాట్లాడుతూ,ఎనిమిదేళ్లుగా జనసంచారం లేక పార్క్ డంపింగ్ యార్డుగా మారి అసాంఘిక శక్తులకు ఆశ్రయంగా మారింది. స్థానిక ప్రజలు పార్క్ వైపు రావాలంటేనే భయపడుతున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా పార్క్‌కు విముక్తి కల్పించేందుకు కమిషనర్ గారి దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయం" అన్నారు. అలాగే పార్క్ చుట్టూ లైట్లు ఏర్పాటు చేయాలని, భద్రత కోసం గేటు నిర్మించాలని అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పార్క్ పునరుద్ధరణతో ప్రాంత ప్రజలకు మళ్లీ సురక్షిత వాతావరణం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఎస్సీ యువతకులను కొట్టి, దూషించిన

# పోలీసులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

బర్రే ఆనంద్ కుమార్ - మట్టి మాఫియాను అడ్డుకున్నందుకు ఎస్సీ యువకులపై పోలీసుల దాడి
- బాధిత కుటుంబాలకు అండగ "స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్)"
- అక్కడితో ఆగకుండా హత్యాయత్నం కేసు నమోదు చేసి యువకులను రిమాండ్‌కు తరలింపు - రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సమాయత్తం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజవర్గం కోరుకొండ మండలంలో మట్టి మాఫియాను అడ్డుకున్నందుకు పోలీసుల దాడిలో గాయపడడమే కాకుండా, వారు పెట్టిన అక్రమ కేసులకు బలై సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదిలుగా ఉన్న బాధిత కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం "స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బర్రే ఆనంద్ కుమార్ రాజమండ్రిలో ఉన్న పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బర్రే ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, "తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం నియోజకవర్గంలో యదేచ్ఛగా సాగుతున్న మట్టి మాఫియా కు పోలీసులు పూర్తిస్థాయి అండదండలు అందించడంతో పాటు, ఎవరైనా అడ్డుపడితే వారిని అంత మొందించడానికి సైతం సిద్ధంగా ఉన్నారని చెప్పడానికి కోరుకొండలో జరిగిన సంఘటన మచ్చుతునక అని అన్నారు. శనివారం రాత్రి కోరుకొండ మండలంలో నరసాపురం నుంచి జంబూపట్నం మీదగా భారీ వాహనాలతో అక్రమ మట్టి తరలింపులో భాగంగా వేగంగా వెళుతుండడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితిని గుర్తించిన స్థానిక ఎస్సీ యువకులు, మట్టి మాఫియా లారీలను అడ్డుకున్నారు. అయితే, స్థానిక ప్రజలకు మద్దతుగా అక్రమాలను అరికట్టవలసిన పోలీసులు, అందుకు విరుద్ధంగా అక్రమ మట్టి తరలింపు అడ్డుకోకూడదని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే మట్టి లారీలను అడ్డుకున్న యువకులపై కోరుకొండ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ అత్యంత కిరాతకంగా కొడుతున్న వీడియోలు కూడా బహిర్గతవయ్యాయని అన్నారు. ఈ విధంగా దాడి చేసిన తర్వాత కూడా మరింత స్థాయిలో స్థానికులను భయపెట్టాలన్న ఉద్దేశంతో, హత్యాయత్నంతో సహా అనేక నాన్ బెయిలబుల్ సెక్షన్స్ పెట్టి ఆ యువకులను 15వ తారీకు ఉదయం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి, అత్యంత దారుణంగా కస్టోడియల్ టార్చర్ చేసి గౌరవ మేజిస్ట్రేట్‌కు తప్పుడు రిపోర్టును అందించి, రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారని తెలిపారు. పోలీసులు యువకులపై చేసిన దాడికి సంబంధించిన వీడియో ఆధారాలతో సహా కోరుకొండ పోలీస్ స్టేషన్ లో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం కేసు కూడా నమోదు చేయలేదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ అవినీతి అక్రమాలకు కొమ్ముకాస్తూ బలహీనులపై ఏ విధంగా విరుచుకుపడుతుందో చెప్పడానికి ఇలాంటి సంఘటనలు ప్రతిబింబిస్తాయి అని అన్నారు. ఈ సంఘటనపై రాష్ట్ర వ్యప్తంగా ఉన్న అన్ని దళిత సంఘాలను, ప్రజాసంఘాలను కలుపుకొని భారీ ఉద్యమానికి సమాయత్తం కానున్నట్లు తెలిపారు. ఇప్పటికే జరిగిన సంఘటనపై ఉన్నత స్థాయి అధికారులకు జాతీయ ఎస్సీ కమిషన్, మానవ హక్కుల కమిషన్ తదితర వ్యవస్థలకు ఫిర్యాదు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు పండా విమల, ముంజవరపు మణి కుమారి, పత్తి నరస, వరిగేటి అరుణా కుమారి, శివశంకర్, బూసి సన్నీ తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణ కార్పొరేషన్ బడ్జెట్లో

# నిధులు కేటాయింపు హర్షణీయం

## బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రాహ్మణ కార్పొరేషన్ - సూపర్ సిక్స్ పథకాలపై కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ ప్రకటనపై రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్లో సూపర్ సిక్స్ పథకాల కింద బ్రాహ్మణ కార్పొరేషన్ సంక్షేమానికి 330 కోట్లు కేటాయింపు చేయడం చారిత్రాత్మక నిర్ణయం అని, అదేవిధంగా 23 కోట్లను కార్పొరేషన్ సబ్సిడీగా అందించి, క్రెడిట్ సొసైటీ ద్వారా బ్రాహ్మణుల్లో చిరు వ్యాపారాలకు, నిరుద్యోగ యువత కిరాణా, పూజా సామాగ్రి, సేవా రంగ వ్యాపారులకు తక్కువ వడ్డీ రుణాలు, సులభమైన దరఖాస్తు ద్వారా త్వరితగతిన ఆమోదం చేస్తామని, వ్యాపారంలో స్థిరపడే వరకు మార్గదర్శక సహాయాలతో బ్రాహ్మణ కుటుంబాలు ఆర్థికంగా బలపడాలని కూటమి ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అయితే సమాజ అవసరాలకు భవిష్యత్తులో బ్రాహ్మణ కార్పొరేషన్ కు మరింత నిధులు కేటాయించేందుకు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నారని తేజోమూర్తుల నరసింహమూర్తి తెలియజేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించినందుకు మరొకసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్‌కి కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఓ న్యాయవాది ఎవరిని

# గెలిపించుకుంటున్నావు...

## - ఆంధ్రా లాయర్స్ అసోసియేషన్ మేడా శ్రీనివాస్ ఆవేదన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** న్యాయవాది మిత్రమా నీవు ప్రకటించుకునే గెలుపు మన భవిష్యత్ ను,కాపాడుకునే లా ఉందా.. నీ వ్యక్తిత్వాన్నా..! చెప్పగలవా మిత్రమా..! న్యాయవాదినని చెప్పుకోవటానికే ఎంతో గర్వాంగా వుండే స్థితి నుండి నీ బలహీనతలకు బానిసగా మారి ఒక నత్తగుల్ల జీవితంగా మార్చుకుంటున్నావు.. న్యాయవాదిగా బ్రతుకుతున్నావా! ఓటరుగా బ్రతుకుతున్నావా మిత్రమా..! నీ ఓటు విలువ 3 వేలు నుండి 10 వేల వరకు మీ అంద బుద్ధితో అమ్ముకోగలిగావు కదా! అదే స్థాయిలో మీ గుణాన్ని ప్రతిభగా గెలిపించుకోగలరా! అందుకు ధర నిర్ణయించగలవా ! మిత్రమా! ఎంతో మంది న్యాయవాదులు ఈ గౌరవ వృత్తిలోకి మక్కువతో వచ్చారు. నేడు నీ అంగడి బుద్ధితో న్యాయవాదుల ప్రతిష్టకు భవిష్యత్ కు శాపంగా మారుతుతున్నావని ఎప్పటికి తెలుసుకుంటావో ఓ న్యాయవాది మిత్రమా! ఒకప్పుడు లాయర్ గారు అనే గౌరవంగా పిలిచే పిలుపు నుండి నేడు మా లాయర్ గాడి వద్దకు వెళ్ళాలి అని తోటివారి వద్ద నీ క్లైయింట్ పలుకుతున్న మాటలు నీకు సిగ్గుగా అనిపించటం లేదా ఓ న్యాయవాది మిత్రమా! నీ బలహీనతలకు అమ్ముడు పోయే నీ తత్వం నీ ప్రతిభతో స్వేచ్ఛగా తిరుగుతున్న నీ క్లైయింట్ వద్ద తలెత్తుకుని నిలబడ గలుగుతుందా! నీ యాచాక బుద్ధి నీ సొంత క్లైయింట్ వద్ద చులకన కాబటం లేదా మిత్రమా! ఒక న్యాయవాది మేధస్సును నమ్ముకుంటే ఆ 3 వేలు ,10 వేలు, మద్యం బాటిల్ , బిర్యానీ, ఇతర కానుకలు సమకుర్చుకోవటం పెద్ద కష్టమైన పని అంటావా! ఓ న్యాయవాది మిత్రమా! ఈ విధంగా వృత్తి గౌరవాన్ని, వ్యక్తిత్వన్ని అమ్ముకునే నిన్ను నీ కుటుంబం గౌరవిస్తుందనుకుంటున్నావా! ఓ న్యాయవాది మిత్రమా! న్యాయవాది ఓటును తను ఆశించిన పదవి కోసం నోటు తోను, కానుకల తోను కొనాలి అనుకుని ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థికి , తోటి న్యాయవాదుల నమ్మకాన్ని గెలవలేను అనుకునే నర్తనశాల బుద్ధికి పెద్దగా తేడా ఏమి ఉంటుంది మిత్రమా! న్యాయవాద వృత్తికి అనర్హుడివి అని నిన్న నీవు బావించుకున్న మరు క్షణం నీ న్యాయవాద వృత్తి పట్టాను స్వచ్ఛందంగా రద్దు చేసుకుని నీ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలి మిత్రమా! 3 వేలకు 10 వేలుకు ఓటును అమ్ముకుని వైశ్య గుణాన్ని చాటుకోకు ఓ న్యాయవాది మిత్రమా! అత్యంత ప్రతిష్టాత్మకమైన న్యాయవాద వృత్తిని కాపాడుకుందాం. న్యాయ ప్రతిష్టకు మార్గదర్శకులుగా నిలుద్దాం. మన హక్కులు, భద్రత, ప్రతిష్ట కోసం శ్రమిద్దాం.. జయిద్దాం...ఈ కథనం అమ్ముడు పోయిన న్యాయవాదులకు మాత్రమే వర్తిస్తుంది.

# రాజమండ్రి పాలు-పెరుగు వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి పాలు-పెరుగు వర్తక సంఘం ఆధ్వర్యంలో స్థానిక టి-నగర్‌లో భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేసి మంచు శివలింగానికి భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, గౌరవ ఉపాధ్యక్షులు మెర్ల సుబ్బారావు, గౌరవ సలహాదారులు కూరాకుల రాంబాబు, గౌరవ ఉప సలహాదారులు మదిరెడ్డి వీరబాబు, నల్లజర్ల వెంకట్రావు, గౌరవ ఉప కార్యదర్శి బొల్లి శ్రీను, కన్వీనర్ శింగన ప్రకాశరావు, అధ్యక్షుడు సూరంపూడి పనసయ్య, కార్యదర్శి లంక రామకృష్ణ, గంగరాజు డెయిరీ అధినేత నిమ్మలపూడి గోవింద్ తదితరులు భక్తులకు ఆహార పదార్థాలు వడ్డించారు. పనసయ్య మాట్లాడుతూ గత 15 సంవత్సరాలు మహాశివరాత్రి రోజున సుమారు 3 వేల 500 మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వైస్ ప్రెసిడెంట్లు నక్కా శ్రీను, చామకూరి నరసింహమూర్తి, కోశాధికారి తోరాటి చెంచయ్య, జాయింట్ సెక్రటరీ కోరసీకుల శ్రీను, మెంబర్స్ వరగోగుల గోవింద్, జబ్బు శ్రీనివాస్, కొత్తగల కామరాజు, నల్లజర్ల నాగు, నంద్యాల నాగవరప్రసాద్, పాలడుగు గాంధీ, గనిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞాననిధి విద్యార్థికి జెఈఈ మైన్స్‌లో 97.74శాతం

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రఘుదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలోగల జ్ఞాననిది ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.గిరీష్ కుమార్ జెఈఈ మైన్స్‌లో 97.74% సాధించాడు. ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటారు కానీ కొందరు మాత్రమే తమ తల్లితండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, గురువులకు గుర్తింపు తీసుకొచ్చే విధంగా లక్ష్య సాధనకు చదువుతారు. ఆ కోవకు చెందినవాడే గిరీష్ కుమార్ అని చెప్పుకునేలా శ్రమించి సాధించాడు. ఇటు పాఠశాలకు ఆటు కళాశాలకు, జన్మనిచ్చిన తల్లితండ్రులకు గౌరవం పెంచాడు.సాధారణ రైతు కూలి కుటుంబంలో జన్మించిన గిరీష్, తల్లితండ్రులకు అక్షరాజ్ఞానం లేకపోయినా, తన కష్టం, అంకితభావంతో విజయం సాధించాడు. సెలవు రోజులలో తోటి విద్యార్థులలా కాకుండా, పొలం పనులకు వెళ్లి తన చదువుకు అవసరమైన డబ్బులు సంపాదించుకునేవాడు. ఇలా చదువుకుంటూ, ఇంతటి ఘనతను సాధించిన గిరీష్ కు అందరూ శుభాకాంక్షలు తెలుపుతూ, మరిన్ని విజయాలు సాదించాలి అని మనసారా కోరుకుంటున్నారు.



సినీ వాయిస్ CINEMA

### మహేష్ బాబును రెండుసార్లు రిజెక్ట్ చేసిన

# స్టార్ హీరోయిన్.. ఎవరంటే.?



మహేష్ బాబుతో రెండు సినిమాల్లో నటించే అవకాశాలను ఓ స్టార్ హీరోయిన్ నో చెప్పేసిందట. యువరాజ్, అర్జున్ చిత్రాలలో ఆమెను ఎంపిక చేయగా.. ఆమె నో చెప్పడంతో ఈ అరుదైన కాంబినేషన్ కుదరలేదు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఓ సారి లుక్కేయండి. సూపర్ స్టార్ మహేష్ బాబు అనేక మంది స్టార్ హీరోయిన్లతో కలిసి నటించినప్పటికీ, ఒక స్టార్ హీరోయిన్ మాత్రం ఆయనతో నటించేందుకు నో చెప్పేసింది. దీంతో సిల్వర్ స్క్రీన్‌పై ఒక అరుదైన జోడి మిస్ అయ్యింది. మహేష్ బాబుకు రెండు సార్లు నో చెప్పిన ఆ నటి ఎవరో కాదు, దివంగత నటి సౌందర్య. మహానటి సావిత్రి లాంటి నటనతో ఒకప్పుడు ఫ్యాన్స్‌ను అలరించింది సౌందర్య. గ్లామర్ అంటే ఎక్స్‌పోజింగ్ కాదని.. అందంగా ఉంటే సరిపోతుందని చెప్పి.. తనకంటూ మంచి ఫ్యాన్ బేస్ పెంచుకుంది ఈమె. మహేష్ బాబు హీరోగా రూపొందిన యువరాజ్ సినిమా కోసం మొదట సౌందర్యను హీరోయిన్‌గా ఎంపిక చేశారట. ఆ సమయంలో నిర్వహించిన ఫోటో షూట్‌లో, మహేష్ బాబు సౌందర్య పక్కన చిన్నగా, తమ్ముడిలా కనిపించాడట. ఈ కారణంతో సౌందర్య ఆ సినిమాలో నటించడానికి నిరాకరించింది. ఆ తర్వాత సిమ్రాన్ ఆ పాత్రలో నటించింది. ఇలాంటి అనుభవమే మరోసారి ఎదురైంది. గుణశేఖర్ దర్శకత్వంలో వచ్చిన అర్జున్ సినిమాకు కూడా ఇదే జరిగింది. ఈ చిత్రంలో మహేష్ బాబు జోడిగా శ్రియ నటించగా, ఆయనకు అక్క పాత్రలో కీర్తి రెడ్డి కనిపించారు. అయితే, ఈ అక్క పాత్ర కోసం ముందుగా సౌందర్యను సంప్రదించారట. మహేష్ బాబుకు అక్కగా చేయనని సౌందర్య ఆ పాత్రకు కూడా నో చెప్పినట్టు టాక్. ఈ విధంగా సౌందర్య రెండు సార్లు మహేష్ బాబుతో కలిసి నటించే అవకాశాలకు నో చెప్పేశారు. మొత్తంగా, ఈ అరుదైన కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పై సెట్ కాకుండానే పోయింది. ఇక అర్జున్ సినిమా విడుదలైన ఏడాదిలోనే సౌందర్య ఒక ప్రమాదంలో కన్నుమూశారు. ఇది మహేష్ బాబు అభిమానులకు ఒక తీరని కోరికగానే మిగిలిపోయింది.

# 1,370 గంటల కష్టం ఈ డ్రెస్..

### గ్లాస్ బీడ్స్, క్రిస్టల్స్ పొదిగిన డ్రెస్‌లో మెరిసిన అలియా భట్





ఆ స్టార్? హీరోయిన్? ఒకవైపు పవర్ హౌస్ పెర్ఫార్మర్ మరోవైపు గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్. ఆమె వేసుకునే దుస్తులు ఎప్పుడూ ట్రెండ్ సెట్ చేస్తుంటాయి. తాజాగా ఆ బ్యూటీ ఒక నల్లటి వెల్వెట్ కార్సెట్ గౌన్ లో మెరిసిపోయింది. ఆ గౌన్ మీద ఉన్న ఎంబ్రాయిడరీ వర్క్ చూస్తే ఎవరికైనా కళ్లు చెదరాల్సిందే. ఈ డ్రెస్ తయారు చేయడానికి కళాకారులు పగలు రాత్రి కష్టపడ్డారు. అంతర్జాతీయ నటీమణులు జెండయా, గిగి హడిద్ వంటి వారు మెచ్చే ఆ ప్రముఖ డిజైనర్ చేతుల్లో ఈ డ్రెస్ రూపుదిద్దుకుంది. ఆ స్టార్ హీరోయిన్ మరెవరో కాదు.. అలియా భట్. రాహుల్ మిశ్రా డిజైన్ చేసిన ఈ అద్భుతమైన డ్రెస్ విశేషాలేంటో చూద్దాం..


**1,370 గంటల శ్రమ..**

నోయిడాలోని తన అటెలియర్‌లో డిజైనర్ రాహుల్ మిశ్రా ఈ డ్రెస్ ను ప్రత్యేకంగా రూపొందించారు. దీనిని తయారు చేయడానికి ఏకంగా 1,370 గంటల సమయం పట్టింది. అంటే దాదాపు రెండు నెలల పాటు కళాకారులు దీనిపై పనిచేశారు. గ్లాస్ బుగ్ల్ బీడ్స్, క్రిస్టల్ బీడ్స్, సీక్విన్స్ తో పాటు క్లిష్టమైన త్రెడ్ ఎంబ్రాయిడరీని ఇందులో వాడారు. స్ప్రింగ్ 2025 కోచర్ కలెక్షన్ లోని 'సిటీ స్కేప్' లైన్ నుండి ఈ పీస్ ను అలియా ఎంచుకుంది. రాహుల్ మిశ్రా ఈ కలెక్షన్ కు "ది పేల్ బ్లూ డాట్" అని పేరు పెట్టారు. ఇది కేవలం అందంగా కనిపించడానికి మాత్రమే కాదు, నేటి నగరాల్లో పెరుగుతున్న కాలుష్యం, మానవ నిర్మిత వాతావరణ మార్పులపై అవగాహన కల్పించడానికి రూపొందించబడింది. "ఒకవేళ మన నగరాలు దెయ్యాల పట్టణాలుగా మారిపోతే పరిస్థితి ఏంటి?" అనే ప్రశ్నను ఆయన ఈ డిజైన్ల ద్వారా ప్రపంచాన్ని అడిగారు. భూమి, జీవితం, సుస్థిరత వంటి అంశాలను దుస్తుల ద్వారా ప్రతిబింబించడం ఒక సవాలుతో కూడిన పని అని ఆయన అభిప్రాయపడ్డారు. రాహుల్ మిశ్రా డిజైన్లకు అంతర్జాతీయంగా భారీ క్రేజ్ ఉంది. గతంలో హాలీవుడ్ నటీమణులు జెండయా, సెలీనా గోమెజ్, గిగి హడిద్ వంటి వారు కూడా ఆయన దుస్తుల్లో మెరిశారు. అలియా భట్ ఈ గౌన్‌కు జతగా డైమండ్ నెక్లెస్, మ్యాచింగ్ ఇయర్ రింగ్స్ ధరించింది. ప్రియాంక కపాడియా స్టైలింగ్ లో అలియా తన జుట్టును లూజ్ గా వదిలేసి, మేకప్ చాలా సింపుల్‌గా ఉంచుకుంది. దీనివల్ల ఆమె డ్రెస్ మీద ఉన్న ఆ అద్భుతమైన పనితనం మరింత హైలైట్ అయ్యింది. అలియా భట్ కేవలం గ్లామర్‌కు మాత్రమే కాకుండా, అర్థవంతమైన ఫ్యాషన్‌కు కూడా ప్రాధాన్యత ఇస్తుందని ఈ డ్రెస్‌తో మరోసారి నిరూపితమైంది. కళాకారుల కష్టానికి, డిజైనర్ ఆలోచనకు అద్దం పట్టిన ఈ 'సిటీ స్కేప్' గౌన్ లో అలియా ఒక దేవతలా మెరిసిపోయింది.

క్రీడా వాయిస్

# ఆస్ట్రేలియా కొంప ముంచుతున్న వరుణుడు..

### 60 బంతులు పడకపోతే కంగారూలు ఇంటికే..





టీ20 ప్రపంచకప్ 2026 గ్రూప్-బిలో భాగంగా శ్రీలంకలోని పల్లెకెలె వేదికగా జరగాల్సిన జింబాబ్వే-ఐర్లాండ్ మ్యాచ్ ఇప్పుడు ఉత్కంఠకు తెరలేపింది. ఈ మ్యాచ్ కేవలం ఈ రెండు జట్లకే కాదు, పాయింట్ల పట్టికలో వెనుకబడిన ఆస్ట్రేలియా భవితవ్యానికి కూడా అత్యంత కీలకంగా మారింది. వాతావరణ శాఖ ముందుగా హెచ్చరించినట్లే పల్లెకెలెలో వరుణుడు ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో టాస్ కూడా పడకుండానే ఆట నిలిచిపోయింది. ఒకవేళ ఈ మ్యాచ్ గనుక వర్షం వల్ల పూర్తిగా రద్దయితే, దాని ప్రభావం ఆస్ట్రేలియా పైన తీవ్రంగా పడనుంది.ఎన్ని గంటలకు మ్యాచ్ మొదలవుతుంది? భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ మ్యాచ్, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా జాప్యమవుతోంది. తాజా నివేదికల ప్రకారం..సాయంత్రం 4:10 గంటల నుంచి ఓవర్ల కోత ప్రక్రియ ప్రారంభమైంది. నిబంధనల ప్రకారం కనీసం 5 ఓవర్ల మ్యాచ్ నిర్వహించాలన్నా సాయంత్రం 6:10 నుంచి 6:15 గంటల లోపు ఆట మొదలుకావాలి. ఒకవేళ అప్పటికి కూడా వర్షం తగ్గకపోయినా లేదా అవుట్‌ఫీల్డ్ ఆటకు అనుకూలించకపోయినా అంపైర్లు మ్యాచ్‌ను అధికారికంగా రద్దు చేస్తారు.

**60 బంతులు.. ఆస్ట్రేలియా తలరాత**

ప్రస్తుతం గ్రూప్-బిలో శ్రీలంక 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండి ఇప్పటికే సూపర్-8కు క్వాలిఫై అయ్యింది. రెండో స్థానం కోసం జింబాబ్వే (4 పాయింట్లు), ఆస్ట్రేలియా (2 పాయింట్లు) మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఆస్ట్రేలియా సూపర్-8 ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ ఖచ్చితంగా గెలవాలి. ఒకవేళ ఈ మ్యాచ్ రద్దయి రెండు జట్లు చెరో పాయింట్ పంచుకుంటే, జింబాబ్వే 5 పాయింట్లతో రెండో స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుంది. అప్పుడు ఆస్ట్రేలియా తన చివరి మ్యాచ్‌లో ఒమన్‌పై గెలిచినా గరిష్టంగా 4 పాయింట్లకే చేరుకుంటుంది. అంటే కనీసం 60 బంతుల ఆట (5 ఓవర్లు) సాధ్యపడకపోతే మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియా టోర్నీ నుంచి నిష్క్రమించినట్లే.

**జింబాబ్వేకు గోల్డెన్ ఛాన్స్**

ఈ టోర్నీలో జింబాబ్వే అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఇప్పటికే మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించి అందరినీ ఆశ్చర్యపరిచిన సికందర్ రజా సేన, ఇప్పుడు చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో ఉంది. వర్షం కారణంగా మ్యాచ్ రద్దయినా లేదా ఐర్లాండ్‌పై విజయం సాధించినా జింబాబ్వే అధికారికంగా సూపర్-8లోకి అడుగుపెడుతుంది. ఇది జరిగితే 2009 తర్వాత ఆస్ట్రేలియా గ్రూప్ స్టేజ్‌లోనే వెనుదిరగడం ఇదే మొదటిసారి అవుతుంది. ఐర్లాండ్ ఇప్పటికే రేసులో వెనుకబడి ఉన్నప్పటికీ, ఈ మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో మెరుగైన స్థానంలో నిలవాలని భావిస్తోంది.

### టీ20 వరల్డ్ కప్‌లో సంచలనం..

# ఒకే దెబ్బకు మూడు జట్లు అవుట్.. సూపర్-8 బెర్తులు కన్ఫర్మ్



టీ20 ప్రపంచకప్ 2026 అసలు సిసలైన మజా మొదలైంది. గ్రూప్ దశ మ్యాచులు ముగింపు దశకు చేరుకోవడంతో సూపర్-8 రేసు రసవత్తరంగా మారింది. తాజాగా జరిగిన మ్యాచులతో టోర్నీలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా చెన్నై వేదికగా న్యూజిలాండ్, కెనడా మధ్య జరిగిన మ్యాచ్ గ్రూప్-డి సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. కెనడాపై న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించడంతో ఒకే దెబ్బకు మూడు జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి.

**గ్రూప్-డి: కివీస్ ఊపు.. మూడు టీమ్స్ అవుట్**

గ్రూప్-డి నుంచి ఇప్పటికే సౌతాఫ్రికా అజేయంగా నిలిచి సూపర్-8 బెర్తును ఖరారు చేసుకుంది. తాజాగా కెనడాను చిత్తు చేసిన న్యూజిలాండ్ రెండో జట్టుగా తదుపరి దశకు క్వాలిఫై అయ్యింది. దీంతో ఇదే గ్రూపులో ఉన్న ఆఫ్ఘనిస్థాన్, యూఏఈ, కెనడా జట్ల ప్రయాణం ముగిసింది. ఎన్నో ఆశలతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్థాన్‌కు ఈ ఫలితం పెద్ద షాక్ అనే చెప్పాలి. కివీస్ ప్రదర్శనతో ఈ గ్రూప్ డి నుంచి సూపర్-8 వెళ్లే జట్లపై స్పష్టత వచ్చేసింది.

**గ్రూప్-సి: విండీస్, ఇంగ్లండ్ జోరు**

ఇక గ్రూప్-సి విషయానికి వస్తే.. ఇక్కడ కూడా లెక్కలు తేలిపోయాయి. వెస్టిండీస్, ఇంగ్లండ్ జట్లు తమ ఆధిపత్యాన్ని చాటుతూ సూపర్-8 లోకి అడుగుపెట్టాయి. ఈ క్రమంలో స్కాట్లాండ్, ఇటలీ, నేపాల్ జట్లు ఇంటిబాట పట్టాయి. ముఖ్యంగా ఇంగ్లండ్ పుంజుకున్న తీరు అభిమానులను ఆకట్టుకోగా, నేపాల్ వంటి చిన్న జట్లు కనీసం ఒక్క గెలుపుతోనైనా టోర్నీని ముగించాలని చూస్తున్నాయి.

**గ్రూప్-ఏ, బి: ఉత్కంఠ భరితం**

గ్రూప్-ఏ నుంచి టీమిండియా ఇప్పటికే తన స్థానాన్ని సుస్థిరం చేసుకోగా, గ్రూప్-బి నుంచి శ్రీలంక క్వాలిఫై అయ్యింది. అయితే ఈ రెండు గ్రూపుల్లో రెండో స్థానం కోసం ఇంకా పోరాటం నడుస్తోంది. గ్రూప్-ఏలో పాకిస్థాన్, అమెరికా జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కొన్ని అనూహ్య ఫలితాలు రావడంతో మిగిలిన జట్ల భవితవ్యం వర్షం లేదా రన్ రేట్‌పై ఆధారపడి ఉంది. సెకండ్ రౌండ్ సమీపిస్తున్న కొద్దీ ఈ ఉత్కంఠ మరింత పెరుగుతోంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com